





వసూళ్లలో.. వెనుకంజ

- పురాల్లో పన్నులు 38.73 శాతమే
- పేరుకుపోతున్న ఆస్తి, నీటి పన్నులు
- రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు
- అధికారుల నిర్లక్ష్యంతో వసూలుకాని బకాయిలు
- వసూళ్లలో రాష్ట్రంలో వినుకొండ ప్రథమ, అద్దంకి ద్వితీయ స్థానం

పురపాలక సంఘాలకు ప్రధాన ఆదాయ వనరు.. పన్నులు. ఇలాంటి పన్నుల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడిపోతున్నాయి. పన్నుల వసూళ్లలో కనీస ప్రయత్నం కూడా ఉండటంలేదని ఈ ఆర్థిక సంవత్సరంలో వసూలైన పన్నులను చూస్తే తెలుస్తోంది. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో రూ.449.49 కోట్లకు 174.11 కోట్లే వసూలు చేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మొత్తంమీద పన్నుల వసూళ్ల శాతం 38.73 శాతమని మున్సిపల్ అధికారులు ప్రకటించారు. ఇక ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నా మున్సిపాల్టీల్లోని అధికారులు సరైన రీతిలో స్పందించడంలేదని బకాయిలను చూస్తే తెలుస్తోంది. ఏటికేడు బకాయిలు పేరుకుపోతున్నాయే కాని వాటి వసూళ్లపై అధికారులు దృష్టి సారించడంలేదు. అవినీతి, రాజకీయ ఒత్తిళ్లతో పన్నుల వసూళ్లలో అధికారులు విఫలమవుతున్నారన్న విమర్శలున్నాయి. లక్ష్యాల మేర పన్నుల వసూళ్లు జరగకపోతుండటంతో ఆ ప్రభావం ఉద్యోగుల జీతాలు, అభివృద్ధి పనులపై పడుతోంది.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయ వనరులను పెంపొందించుకోవడంలో మున్సిపాలిటీలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని పన్నుల వసూళ్లను చూస్తే తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తి, నీటి పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి. మున్సిపాలిటీలకు ఇచ్చిన లక్ష్యాల మేర పన్ను వసూలు జరగడం లేదు. సిబ్బంది అలసత్వంతో వసూలు మందకొడిగా సాగుతోంది. ఆస్తి, నీటి, ఇతర పన్నులు రూ.449.49 కోట్లు వసూలు చేయాలి. ఇప్పటి వరకు రూ.174.11 కోట్లు మాత్రమే వసూలు చేశారు. వసూళ్లలో రాష్ట్రంలోనే వినుకొండ ప్రథమ, అద్దంకి మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలలోని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను రూ.368.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.157.71 కోట్లు వసూలైనట్లు డీఎంఏ కార్యాలయ లెక్కలు తెలియజేస్తున్నాయి. పన్ను వసూలు శాతం 42.75గా నమోదైంది. నీటి పన్ను వసూలు కూడా నామ మాత్రంగా ఉంది. తాగునీటి పన్ను రూ.80.62 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.16.40 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. నీటి పన్ను వసూలు 20.34 శాతంగా ఉంది. ఉన్నతాధికారులు పన్ను వసూళ్లపై సమీక్షిస్తున్నా మున్సిపాలిటీలలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యాన్ని వీడటం లేదు. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతున్నది. పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా వారి మొర మున్సిపాలిటీ అధికారులు ఆలకించే పరిస్థితి లేదు. మార్చి ఆఖరుకల్లా సుమారు రూ.211.16 కోట్లు ఆస్తి, తాగునీటి పన్ను రూ.64.22 వసూలు చేయాల్సి ఉంది. గుంటూరు కార్పొరేషన్‌లో దాదాపు రూ.20.36 కోట్లు ప్రభుత్వ సంస్థల భవనాలు, కార్యాలయాలకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోయాయి. సత్తెనపల్లి పురపాలక సంఘంలో ఎఫ్‌సీఐ రూ.3.47 కోట్లు పన్ను బకాయిలు చెల్లించాల్సి ఉంది. అన్ని పురపాలక సంఘాలలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలు పేరుకుపోతున్నాయి.



జీతాలు, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం

నిధుల లేమితో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల నిర్వహణ, కాంట్రాక్ట్ కార్మికుల జీతాల చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నది. సకాలంలో పన్నుల వసూళ్లు కాకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకుందనేది బహిరంగ రహస్యం. అయినా అటు అధికారులు ఇటు పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలను గాలికివదిలేసిందని అందువల్లే ప్రధాన ఆదాయవనరైన పన్నుల వసూళ్లలో వెనుకంజలో ఉన్నట్లు అర్థమవుతుంది. సాధారణ నిధుల నుంచి చేపట్టే పనులకు సంబంధించిన బిల్లులు చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు అభివృద్ధి పనులను నిలిపి వేస్తున్నారు.

పన్నుల వసూళ్లలో అక్రమాలు..

ఆస్తి, తాగునీటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు ఇతర పన్నుల వసూళ్లలో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలున్నాయి. మున్సిపాల్టీల్లో ప్రధానంగా ప్రకటనల పన్ను పక్కదారి పడుతోంది. పట్టణాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రకటనల బోర్డులకు, వాటి పన్నుల వసూళ్లకు పొంతన ఉండటంలేదు. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనలకు సంబంధించిన పన్నుల వసూలులో అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ రెండు పన్నుల ఆదాయాన్ని పెంచుకోవడంలో అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. తాత్కాలిక ఆక్రమణలు, ప్రకటనల పన్నులకు సంబంధించి ఏటా ఒక్కో మున్సిపాలిటీ లక్షల్లో ఆదాయాన్ని కోల్పోతున్నది. ప్రణాళికా విభాగం పర్యవేక్షణ లేక పోవడం వల్లే ఈ ఆదాయాన్ని మున్సిపాలిటీలు రాబట్టుకోలేకపోతున్నాయి.

మున్సిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూళ్లు ఇలా...

మున్సిపాలిటీ	వసూళ్ల లక్ష్యం రూ.కోట్లలో	వసూలు రూ.కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా			
నరసరావుపేట	14.83	6.99	47.10
చిలకలూరిపేట	14.14	3.84	27.20
వినుకొండ	4.26	3.75	88.20
సత్తెనపల్లి	6.40	2.92	45.70
మాచర్ల	4.90	2.37	48.50
పిడుగురాళ్ల	4.74	2.66	56.10
దాచేపల్లి	1.78	1.17	65.90
గురజాల	1.29	0.59	46.00
బాపట్ల జిల్లా			
రేపల్లె	4.76	2.83	59.40
బాపట	8.14	3.97	48.80
అద్దంకి	3.78	3.05	80.90
చీరాల	10.30	6.73	65.40
గుంటూరు జిల్లా			
గుంటూరు కార్పొరేషన్	231.64	80.03	34.50
పొన్నూరు	5.07	2.95	58.20
మంగళగిరి, తాడేపల్లి	30.62	19.30	62.89
తెనాలి	22.22	11.59	52.10

బరులు.. సిద్ధం

- గ్రామాల్లో పందాలకు సై
- వైసీపీ నేతల కనుసన్నల్లోనే ఏర్పాట్లు
- కత్తులు దూసేందుకు సిద్ధమవుతోన్న కోళ్లు
- పోలీసు హెచ్చరికలను ఖాతరు చేయని వైనం



వేమూరు మండలం వరహాపురం వద్ద కోడి పందాల కోసం ఏర్పాటు చేసిన బరి



చుండూరు మండలం వేటపాలెంలో బరి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు



రేపల్లె వద్ద ఏర్పాటు చేసిన బరి వద్ద ఉన్న పోలీసులు

కొల్లూరు, అద్దంకి/బాపట్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి ఇంకా సమయం ఉన్నా.. కోడి పందాలకు బరులు సిద్ధమవుతున్నాయి. కత్తులతో కోళ్లు.. పందాలకు జూదరులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల ఏడాది కావడంతో ఈ సారి భారీగానే కోడి పందాలు జరిగేలా నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. పందాలకు అనుమతి లేదని పోలీసుల హెచ్చరికలు ఖాతరు చేయడంలేదు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో కోడి పందాలను భారీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎక్కడికక్కడ పాలకపార్టీ నేతల కనుసన్నల్లోనే ఈ తంతు జరుగుతుంది. వేమూరు మండలం వరహాపురం పరిధిలో కోడి పందాలు వేసేందుకు బరి దాదాపు సిద్ధమైంది. కొల్లూరు మండలం పెసర్లంక సమీపంలో బరిని ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో పెదపులివర్రు, ఓలేరు-పేటేరు మధ్యలోని జాతీయ రహదారి వెంబడి భారీ స్థాయిలో బరికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. చుండూరు మండలం వేటపాలెంలో కోడి పందాలకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. బరుల సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడ సిబ్బందిని ఏర్పాటు చేసినా వారిని పట్టించుకోకుండా ట్రాక్టర్లతో భూమి చదును, బారీకేడ్లు తదితర పనుల్లో నిర్వాహకులు ఉన్నారు. వేమూరు పరిధిలో మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున ఆశీస్సులతో ఆ పార్టీ నాయకులు కోడి పందాలకు బరులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు సర్కిల్ పరిధిలో కోడి పందాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. నిర్వాహకులు కొన్నిప్రదేశాలను ఎంపిక చేసుకుని జూదరులకు సెల్‌ఫోన్ల ద్వారా సమాచారం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే బాపట్ల జిల్లా ఎస్పీ జిందాల్ గురువారం డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎక్కడా కోడి పందాలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా కోడి పందాలు జరిగినట్లు సమాచారం వస్తే ఆ పరిధిలో ఉన్న ఎస్‌ఐలను సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

గ్రామోదయంలో కలెక్టర్ దృష్టికి సమస్యలు



గ్రామోదయంలో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ శివశంకర్

అమరావతి, జనవరి 12: మండల పరిధిలోని మునగోడు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామోదయం కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ పాల్గొని ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ముందుగా ఎస్సీకాలనీలో ఆయన పర్యటించారు. మురుగు కాల్వలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ గుర్తించారు. ఇంటింటికి తాగునీటి కుళాయి కోసం సీసీ రోడ్లను పగలగొట్టి వదిలేశారని కాలనీవాసులు కలెక్టర్‌కు తెలిపారు. మందిరాల విషయంలో వివాదాలు లేకుండా ప్రార్థనలు చేసుకోవాలని కాలనీవాసులకు హితవు పలికారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో చెత్తను సేకరించే సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. చివరిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కలెక్టర్‌ను కలిసి గ్రామ సమస్యలపై చర్చించారు.

మూడు రాజధానుల ఆలోచన నుంచి సీఎం బయటకు రావాలి

- 1487 వ రోజుకు రైతుల ఆందోళనలు

పండుగ ప్రయాణం కిటకిట

- బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ
- సర్వీసులు లేక గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇక్కట్లు

6 లో..

రేపటి నుంచి సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట కల్చరల్: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి మూడు రోజుల పాటు డీఎస్‌ఏ స్టేడియంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ తెలిపారు. సంబరాలకు సంబంధించి వివరాలను శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆయన ప్రకటించారు. 14న ఆదివారం ఉదయం భోగి మంటలు, ముగ్గులు, భోగిపండ్లు తదితర సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 15న సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. సినీ సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమం, జబర్దస్త్ ఫేం రాజమౌళి, వినోదిని, కెవ్వుకార్తీక్ బృందంచే హాస్యవల్లరి, చెన్నై టీంచే జగ్లింగ్, హైదరాబాద్ టీంచే నృత్య ప్రదర్శన, సంప్రదాయ దుస్తుల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. 16న సినీ సంగీత దర్శకులు రఘు కుంచె బృందంచే జానపద పాటలు, జబర్దస్త్ టీం ఇమ్మానుయేలు, శాంతి స్వరూప్, నవీన్‌లచే హాస్య వల్లరి, బెంగళూరు, గోవా వారిచే రష్యన్ క్విక్ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

హరిదాసు.. ఓ జ్ఞాపకం

- కనుమరుగైపోయిన సనాతన ఆచారం
- వినపడని హరిలో రంగ హరి సంకీర్తన



గుంటూరు సిటీ, జనవరి 12: చేతిలో చిడతలు, కాళ్లకు గజ్జెలు, పట్టు పంచె ధోవతి, నెత్తిన గుండ్రటి రాగిపాత్ర నోటి నిండా నారాయణుని నామ సంకీర్తనతో పొద్దు పొడవక ముందే తరతమ భేదం లేకుండా ఇంటింటికి వచ్చే వారే హరిదాసులు. ధనుర్మాసం ఆరంభం కాగానే హరిదాసు ఇంటి ముందుకు వచ్చాడంటే సంక్రాంతి దగ్గర్లో ఉన్నట్లు లెక్క. వాళ్లకి కుల మతాలతో పనిలేదు. ధనికులు దరిద్రులన్న తేడా లేదు. హరినామ స్మరణ చేసే వారిని అనుగ్రహించడానికి హరిదాసు రూపంలో వైకుంఠం నుంచి సాక్షాత్తు శ్రీమహావిష్ణువే వస్తాడన్నది నమ్మకం. హరిదాసు వట్టిచేతులతో వెళ్లిపోతే ఆ ఇంటికి అరిష్టమని కొంతమంది నమ్మకం. అందుకే ఊరిలోకి హరిదాసుడు వస్తున్నాడంటే ఇంటి యజమానురాలు ధాన్యంతో గుమ్మంలో సిద్ధంగా ఉంటారు. ఒక ముక్క లో చెప్పాలంటే హరిదాసు మన సంస్కృతి లో భాగం. సంక్రాంతి పండుగలో భాగం. చిన్నప్పటి మన జ్ఞాపకం. ఇప్పుడా హరిదాసు కనపడటం లేదు. హరిలో రంగ హరి అంటూ వినిపించే హరినామ సంకీర్తన వినపడటం లేదు. మొత్తంగా హరిదాసు జాడేలేదు. మారిన సమాజ స్థితిగతులు శతాబ్దాల నాటి హరిదాసు వైభవాన్ని మాయం చేశాయి. తాతలు, తండ్రుల తరం వెళ్లిపోయాక వారి పిల్లలు హరిదాసు కట్టు బొట్టు పెట్టేందుకు తటపటాయిస్తున్నారు. కొన్ని చోట్ల తగినంత ఆదరణ లేకపోవడం, మరికొన్ని చోట్ల కొద్దిగా చిన్న చూపు చూస్తూ ఉండటంతో తండ్రి వారసత్వంగా హరిదాసు వృత్తిని కొనసాగించేందుకు వారి పిల్లలు ముందుకు రావడం లేదు. ఈ పరిస్థితుల్లో హరిదాసు ఓ జ్ఞాపకంగా మారాడు. పాత సినిమాల్లో.. పుస్తకాల్లో.. కథల్లో.. ఓ స్మృతిగా కనిపిస్తున్నాడు.

ఉదయ్‌తో విశాఖకి కనెక్టివిటీ

- జెండా ఊపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో అట్టహాసంగా ప్రారంభోత్సవం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉదయ్ ఏసీ డబుల్ డెక్కర్ రైలుతో గుంటూరు - విశాఖపట్టణం మధ్య రైలు కనెక్టివిటీ మరింత పెరిగిందని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి తెలిపారు. వారంలో ఐదు రోజులు నడిచే ఈ రైలు సమయపట్టిక ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. వేకువజామున విశాఖలో బయలుదేరితే మధ్యాహ్నానికి గుంటూరుకు చేరుకోవచ్చని, అలానే గుంటూరులో సాయంత్రం రైలు ఎక్కితే రాత్రికి విశాఖ చేరవచ్చన్నారు. శుక్రవారం సాయంత్రం గుంటూరు రైల్వేస్టేషన్‌లో ఉదయ్ ఎక్స్‌ప్రెస్ పొడిగింపు ప్రారంభోత్సవం జరిగింది. రేణిగుంటలో నంద్యాల ప్యాసింజర్, నరసపూర్‌లో అమరావతి ఎక్స్‌ప్రెస్‌లను వీడియో లింకు ద్వారా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసిన మంత్రి కిషన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరైన రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రయాణికులను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ బోగీలతో పాటు నాన్ ఏసీ కోచ్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. అలానే కర్ణాటక ప్రాంతానికి కోస్తాంధ్రతో కనెక్టివిటీ పెంచేందుకు హుబ్లీ - విజయవాడ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్‌కు పొడిగించామన్నారు. నంద్యాల ప్రాంత ప్రయాణికులకు తిరుపతి కనెక్టివిటీని పెంచేందుకు నంద్యాల - కడప రైలుని రేణిగుంటకు పొడిగించామని చెప్పారు. ఈ మూడు రైళ్ల పొడిగింపులతో ప్రయాణికులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ రైల్వేలో ప్రధాని మోదీ నేతృత్వంలో అనేక సంస్కరణలను ప్రవేశపెట్టడం అభినందనీయమన్నారు. గుంటూరులో పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీలు, ఆర్‌యూబీలకు ఆమోదం తెలపాలని కోరారు. అలానే రైల్వేస్టేషన్‌కు రెండు వైపులా అప్రోచ్‌రోడ్లను రైల్వే నిర్మించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం ఎం రామకృష్ణ, బీజేపీ మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, గుంటూరు పశ్చిమ ఇన్‌చార్జి వల్లూరు జయప్రకాష్‌నారాయణ, జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర, సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌కి సిగ్నల్ ఇస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు మృతి

దాచేపల్లి, జనవరి 12: అప్పుల బాధ తాళలేక కౌలురైతు బలవన్మరణం చేసుకున్న సంఘటన శుక్రవారం దాచేపల్లి మండలంలోని కేశానుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కడియం రవి (32) ఇంట్లోని దూలానికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి 10 లక్షలకు పైగా అప్పు వుందని, 3 ఎకరాలలో మిర్చి, 5 ఎకరాలలో పత్తి పంటలు సాగుచేసినట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఐదేళ్ల, రెండేళ్ల వయసు కలిగిన పాప, బాబు వున్నారు. దాచేపల్లి ఎస్‌ఐ సంధ్యారాణి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకాశంలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 12 : ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మరో కొవిడ్ పాజిటివ్ కేసు నమోదైంది. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళ మహారాష్ట్రకు వెళ్లి వచ్చారు. అనంతరం ఇంకొల్లులోని తల్లి ఇంటికి చేరుకున్నారు. అనారోగ్యంగా ఉండటంతో ఒంగోలు జీజీహెచ్‌లో పరీక్ష చేయించుకున్నారు. శుక్రవారం వచ్చిన ఫలితాల్లో ఆమెకు పాజిటివ్ అని నిర్ధారణ అయింది. ప్రస్తుతం ఆమె ఇంకొల్లులోని తన తల్లి ఇంట్లో ఐసోలేషన్‌లో ఉండి చికిత్స పొందుతున్నట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ భగవాన్ నాయక్, ఆర్ఎంవో డాక్టర్ బీ తిరుమలరావు తెలిపారు.

కౌలు రైతుల ఉసురు తీస్తున్న ప్రభుత్వం : ప్రత్తిపాటి

చిలకలూరిపేట అర్బన్, జనవరి 12 : రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కౌలు రైతుల ఉసురు తీస్తుందని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా కేవలం 75వేల మంది కైలు రైతులకురుణాలు అందించామని చెప్పటానికి ఆర్థిక మంత్రి బుగ్గనకు కనీసం సిగ్గు ఉందా? ప్రశ్నించారు. జగన్ ప్రతిపక్షంలో ఉండగా, ముఖ్యమంత్రి అయ్యాక కూడా రాష్ట్రంలో 15 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారని, వారందరికీ రైతు భరోసా అందిస్తామని ఇచ్చిన హామి ఏమై పోయిందని? ప్రత్తిపాటి నిలదీశారు. చిలకలూరిపేటలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ సీసీఆర్సీ కార్డుల విధానం అని, ఇప్పటికి మూడు లక్షల మందిని మాత్రమే గుర్తించటం దారుణం అనుకుంటే వారిలో 75వేల మందికే బ్యాంక్ రుణాలు అందించటం దయనీయం అన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీని బంగాళఖాతంలో కలపటానికి ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశం, జనసేన కూటమికి అధికారం తథ్యమని ఉద్ఘాటించారు.

పాఠశాల స్థలం కబ్జాకు వైసీపీ నాయకుడి యత్నం

నిర్మాణానికి ఇసుక, కంకర తరలింపు ● ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదం



వైసీపీ నాయకుడు కబ్జాకు యత్నం చేస్తున్న స్థలం వద్ద రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది

నిడుముక్కల(తాడికొండ), జనవరి 12: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆట స్థలాన్ని కబ్జా చేయడానికి వైసీపీ నాయకుడు విశ్వప్రయత్నం చేస్తున్నారు. స్థలంలో నిర్మాణాలు చేపట్టడానికి శుక్రవారం ఇసుక, కంకరను తరలించారు. దీంతో విషయం తెలుసుకున్న రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సెక్రటరి సంఘటన స్థలానికి చేరుకొని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించరాదని హెచ్చరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బందిపై ఆ నేత వాగ్వాదానికి దిగారు. అయితే గత ఆదివారం కూడా ఇదేవిధంగా స్థలం ప్రహరి పగలగొట్టి గోతులు తీయడానికి ప్రయ్నతం చేయటంతో రెవెన్యూ సిబ్బంది అడ్డుకున్నారు. పాఠశాలకు చెందిన భూమిలో నిర్మాణాలు చేపట్టడానికి స్థలం ప్రహరీని పగలగొట్టి పునాదులు తీసి నిర్మాణాలు చేపట్టడానికి చిగురుపాటి వీర రాఘవయ్య సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వీఆర్‌వో సంఘటన స్థలానికి చెరుకుని ప్రభుత్వ స్థలంలో ఎలాంటి నిర్మాణాలు, పనులు చేపట్టరాదని హెచ్చరించారు. హెచ్చరికబోర్డులు పెట్టడానికి ప్రయత్నించిన రెవెన్యూ సిబ్బందితో ఆయన వాగ్వాదానికి దిగి బోర్డులు ఏర్పాటు చేస్తే పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటా నని బెదిరించారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆయనకు నచ్చజెప్పి బోర్డులు ఏర్పాటు చేయమని, ఏదైన ఉంటే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి వివరణ ఇవ్వాలన్నారు. వివరాల్లోకి వెళితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు గ్రామంలో ఉన్న పాఠశాలకు జిల్లా పరిషత్ హోదా కోసం స్థానిక టీడీపీ నాయకులు ప్రయత్నించారు. పాఠశాలకు జడ్పీ హోదా రావాలి అంటే సుమారు రెండు ఎకరాలు ఆట స్థలం కావాలని విద్యాశాఖ చెప్పటంతో సర్వే 259లోని సాముదాయ పోరంబోకు లోని సుమారు రెండు ఎకరాల స్థలాన్ని పాఠశాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం కేటాయించింది. దీంతో నిడుముక్కల పాఠశాలకు జడ్పీ పాఠశాల హోదాను విద్యాశాఖ మంజూరు చేసింది. స్థానిక టీడీపీ నాయకులు ఆ స్థలాన్ని బాగు చేయించి ప్రహరీని నిర్మించారు. కాలక్రమేణ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత జడ్పీ పాఠశాల స్థలాన్ని ఆక్రమించి ఇళ్ల నిర్మించుకోవాలని వైసీపీ శ్రేణులు ప్రయత్నించారు. కాని టీడీపీ నాయకులు చాలా సార్లు ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకువెళ్లారు. అంతేకాకుండా సదరు స్థలం జడ్పీపాఠశాలకు చెందిన భూమి అని హైకోర్టులో పిటీషన్ వేశారు. ప్రస్తుతం ఆ స్థలం కోర్టు పరిధిలో ఉన్నది కాని వైసీపీకి చెందిన వారు స్థలాన్ని ఆక్రమించాలనే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. పాఠశాల విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్థలాన్ని కేటాయిస్తే దానిని కూడా కబ్జా చేసేందుకు అధికారపార్టీ నాయకులు ఆక్రమణదారులకు అండగా ఉంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులకు పాఠశాల స్థలాన్ని కాపాడాల్సి బాధ్యత ఉన్నదని గ్రామస్తులు తెలిపారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశం

●జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి

గుంటూరు సిటీ, జనవరి 12: ఈ ఏడాది మార్చి నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్ అదాలత్ కక్షిదారులకు గొప్ప అవకాశమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థసారథి అన్నారు. శుక్రవారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు క్యాలెండర్ కార్యకలాపాల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ రాజీపడదగిన క్రిమినల్ కేసులను, భాగ పంపిణీ కేసులను పరిష్కరించుకోవటానికి జాతీయ లోక్ అదాలత్ చక్కని వేదిక అని అన్నారు. సంవత్సరంలో నాలుగు జాతీయ లోక్ అదాలత్‌లు ఏర్పాటు చేయటం ద్వారా కక్షిదారులకు కేసులు రాజీ చేసుకోవటానికి ధనము కాలము ఆదా చేసుకోవటానికి మంచి అవకాశమని అన్నారు. పెర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ చైర్మన్ రాంబాబు ఈ సమావేశంలో లోక్ అదాలత్ గురించి తెలియ చేసారు.

నేటి బాలలే రేపటి పౌరులు

నేటి బాలలే రేపటి పౌరులని వాళ్లకు చట్ట సభల గురించి తెలియ చేయటం ముదావహమని న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి అన్నారు. అరండల్ పేటలో జరిగిన డిస్ట్రిక్ట్ లెవెల్ బాల పంచాయత్ ఇంటర్ఫేస్ మీటింగ్‌లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ పిల్లలు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి తెలుసుకోవాలని వారి చుట్టపక్కలవారికి తెలియ చేయాలని అన్నారు. ఈ సందర్భంగా బాల పంచాయతీ సభ్యులకు న్యాయ సేవాధికార చట్టం, బాలల హక్కుల గురించి వివరించారు. ఈ సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ ప్రమీల, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎ గాయత్రీ దేవి, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ విజయ్ కుమార్, బచిపన్ బచావో ఆందోలన్ స్టేట్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, చైల్డ్ రైట్స్ స్టేట్ ప్రోగ్రాం డైరెక్టర్ ఫ్రాన్సిస్ తంబీ తదితరులు పాల్గొన్నారు.

పండుగ ప్రయాణం.. కిటకిట

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ ● సర్వీసులు లేక గమ్యస్థానాలకు వెళ్లేందుకు ఇక్కట్లు



గుంటూరు ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు, సీట్ల కోసం ఎగబడుతున్న ప్రయాణికులు

గుంటూరు, జనవరి 12: సంక్రాంతి పండుగకు సొంతూళ్ళకు వెళ్ళేందుకు ప్రయాణికులు ఆర్టీసీ బస్టాండ్‌కు క్యూ కడుతున్నారు. పండుగకు నాలుగు రోజులు ముందుగానే ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ కనిపిస్తోంది. హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు వంటి దూర ప్రాంతాల నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణీకుల కోసం ఇప్పటికే స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశారు. స్పెషల్ బస్సుల్లో సైతం సాధారణ ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఇప్పటికే ఆర్టీసీ ప్రకటించటంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. గుంటూరు -1, 2 డిపోలతో పాటు పొన్నూరు, మంగళగిరి, తెనాలి డిపోల నుంచి అదనపు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డీపీటీవో రవికాంత్ తెలిపారు. ముఖ్యంగా కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు సొంతూళ్ళకు వెళ్ళేందుకు పెద్ద ఎత్తున బస్టాండ్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటికే విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించటంతో విద్యార్థుల కోలాహలం కనిపిస్తోంది. గుంటూరు నుంచి విజయవాడతో పాటు రాయలసీమ, గోదావరి జిల్లాల నుంచి ఇక్కడకు చదువుల కోసం వచ్చిన విద్యార్థులు పండుగకు సొంతూళ్ళకు వెళుతున్నారు. ఇక శనివారం నుంచి ఉద్యోగుల రద్దీ కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రయాణికులకు తప్పని ప్రయాణ కష్టాలు...

పండుగ ప్రయాణ కష్టాలు తప్పటం లేదని పలువురు పోతున్నారు. దూర ప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేసిన అధికారులు జిల్లాలో తిరిగే బస్సుల సంఖ్య పెంచకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని వాపోతున్నారు. ముఖ్యంగా గుంటూరు నుంచి బాపట్ల, పల్నాడు ప్రాంతాల వైపునకు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లె వెలుగు సర్వీసులకు కోత పెట్టటంతో పాటు సమయానికి బస్సులు లేకపోవటంతో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఆయా మార్గాల్లో రద్దీకి అనుగుణంగా అధికారులు సర్వీసులు అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్‌లో రైళ్ల కోసం వేచ్చి ఉన్న ప్రయాణికులు, బోగీ వద్ద ప్రయాణికులు

నేడు విశాఖపట్టణానికి ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణీకుల రద్దీ దృష్ట్యా శనివారం విశాఖపట్టణానికి ప్రత్యేక రైలుని నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో సీహెచ్ రాకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెంబరు. 08591 విశాఖపట్టనం - గుంటూరు రైలు శనివారం ఉదయం 8.20కి బయలుదేరి దువ్వాడ, సామర్లకోట, రాజమండి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదగా మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. నెంబరు. 08592 గుంటూరు - విశాఖపట్టణం రైలు శనివారం సాయంత్రం 5 గంటలకు బయలుదేరి పైన పేర్కొన్న స్టేషన్ల మీదగా రాత్రి 11.50కి విశాఖపట్టణం చేరుకొంటుంది. ఈ రైలులో ఏసీ టూటైర్ ఎకానమి, స్లీపర్ క్లాస్ భోగీలుంటాయని సీపీఆర్‌వో తెలిపారు.

23, 24 తేదీల్లో 'ఐపీ యాత్ర'పై వర్క్‌షాప్

అమరావతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) నిర్వాహకులకు ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ (ఐపీఆర్)పై అవగాహన కల్పించేందుకు కేఎల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో విజయవాడలో వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తెలిపింది. ఇండస్ట్రియల్ డిజైన్స్, కాపీరైట్స్, పేటెంట్స్, ట్రేడ్‌మార్క్, ట్రేడ్ సీక్రెట్స్, జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ (జీఐ) రిజిస్ట్రేషన్స్ తదితర అంశాలపై ఎంఎస్‌ఎంఈ మంత్రిత్వశాఖ అధికారులు, ఆయా రంగాల నిపుణు లు సలహాలు, సూచనలు ఇచ్చి అవగాహన కల్పించనున్నట్టు వివరించింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, ఎంఎస్‌ఎంఈల మేథోసంపత్తిని ప్రోత్సహించడంతోపాటు దేశ, విదేశాల్లో ఈ-ఫైలింగ్స్ సంఖ్యను పెంచడమే లక్ష్యంగా సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ 'ఐపీ యాత్ర' పేరుతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ వర్క్‌షాపులో పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందజేస్తారని ప్రకటించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	91, 99, 110
చికెన్ విత్ స్కిన్	176.00
చికెన్ స్కిన్ లెస్	186.00

మూడు రాజధానుల ఆలోచన నుండి సీఎం బయటకు రావాలి

తుళ్లూరు జనవరి 12: మూడు రాజధానుల మూర్ఖపు ఆలోచన నుండి సీఎం జనగన్ రెడ్డి బయటకు రావాలని రాజధాని అమరావతికి 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు రైతు కూలీలు , మహిళలు చేస్తున్న ఆందోళనలు శుక్రవారం నాటికి 1487 వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడారు. ప్రజల మనోభావాలను గౌరవించకుండా సీఎం జగన్‌రెడ్డి మూడు రాజధానులటం నియంత పోకడలకు నిదర్శనమన్నారు. ప్రజా స్వామ్యంలో నియంత నిర్ణయాలు తీసుకుంటే గద్దె దిగాల్సి ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లైనా అమరావతి రాజధాని కట్టలేకపోయింది. మన అధికారంలోకి రాగానే బ్రహ్మాండంగా కడతాం.. అని సీఎం జగన్‌రెడ్డి చేసిన ప్రసంగాలను గుర్తు తెచ్చుకోవాలన్నారు . అధికారంలోకి రాగానే అమరావతిని భ్రమారావతి అని , ముంపు అని, ఎడారని , అనేక అసత్య ప్రచారాలు చేశారన్నారు. మరి ముంపు ప్రాంతం నుండే రాష్ట్ర పరిపాలన గత ఏడేళ్ల నుండి జరుగుతుంది కదా.. పాలకులు మునగలేదే.. దీనికి సమాధానం ఏం చెపుతారన్నారు. ఇప్పటికైనా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కల ఆట మానుకోవాలన్నారు. ప్రజల అభీష్టం మేరకు , రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతే రాష్ట్ర ఏకైక రాజధానిగా ప్రకటించి అభివృద్ధిని కొనసాగించాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.

1487 వ రోజుకు రైతుల ఆందోళనలు



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

63,634 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 63,634 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 69,258 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 33,872 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8500	20000	334	9000	19000
నెంబరు. 5	11500	18200	నెంబరు. 5	15000	15000
273	12500	14000	273	–	–
341	10000	18000	341	13500	17800
4884	12000	18500	4884	–	–
సూపర్ 10	--	--	సూపర్ 10	–	–
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000	తేజ	9000	15000
బ్యాడిగి	9000	20000	బ్యాడిగి	11000	17000
దేవనూరు డీలక్స్	10000	20000	దేననూరు డీలక్స్	–	–
తెల్లకాయలు	5000	13000	తెల్లకాయలు	5000	12000

అంబేడ్కర్ విగ్రహ సాధనలో 'గోళ్లమూడి'ని గుర్తించాలి

ప్రభుత్వాన్ని కోరిన వివిధ దళిత సంఘాల నేతలు

విజయవాడ, జనవరి 12: విజయవాడ స్వరాజ్య మైదానంలో ప్రారంభించబోతున్న అంబేడ్కర్ విగ్రహ సాధనకు గోళ్లమూడి రాజసుందరబాబు చేసిన పోరాటాన్ని గుర్తించి, ఆయనను తగిన విధంగా సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పలు దళిత, గిరిజన, ప్రజా, ఉద్యోగ, అంబేడ్కర్ యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడా రు. 2014 నుంచి 2016 వరకు రాజసుందరబాబు నాయకత్వంలో చేసి న నిరంతర పోరాటం కారణంగానే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహ స్థాపనపై 2016 మార్చి 19న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. తర్వాత 2017 ఏప్రిల్ 14న అమరావతిలో టీడీపీ ప్రభుత్వం విగ్రహ నిర్మాణానికి శంకుస్థాపన చేసిందన్నారు. 2020 అక్టోబరు 9న సీఎం జగన్ స్వరాజ్య మైదానంలో 18 ఎకరాల్లో శంకు స్థాపన చేసి రూ.400 కోట్లతో అంబేడ్కర్ విగ్రహాన్ని నిర్మించి జాతికి అంకితం చేయనున్నారన్నారు. చార్వాక యూత్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్లమూడి స్టాలిన్‌బాబు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు సాంబయ్య, ఇద్వా సంఘం నేతలు బేతపూడి భారతి, దారా వెంకటరత్నం పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నేతలు

అధిక చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు : డీటీసీ కరీం

గుంటూరు(తూర్పు), జనవరి 12: సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా కాంట్రాక్ట్ క్యారేజ్ నిర్వాహకులు ప్రయాణికుల నుంచి అధికచార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీటీసీ కరీం హెచ్చరించారు. శుక్రవారం టోల్‌ప్లాజా వద్ద ఆయన బస్సులను తనిఖీలు చేశారు. అనంతరం కరీం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి టోల్ ప్లాజా, పేరేచర్ల జంక్షన్ వద్ద కాంట్రాక్టు బస్సులపై రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి మొత్తం 89 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఇందులో బస్సులో సరుకులు చేరవేసినందుకుగాను 23, ప్రయాణికుల వివరాలు పట్టిక నిర్వహించనందుకు 8, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడిపినందుకు 5, మల్టిటోనడ్ హరన్‌పై 14, మిగతా ఇతర నిబంధనలు పాటించనందుకు 39 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం చేశారు.

బిల్డింగ్ పైనుంచి పడి ఒకరి మృతి

ఏలూరు క్రైం, జనవరి 12: బిల్డింగ్‌కు సున్నం వేస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందిన ఘటన ఏలూరులో శుక్రవారం చోటుచేసుకుంది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కె.మరియదాసు(40) కొంతకాలం నుంచి ఏలూరు జిల్లా ఏలూరు తూర్పువీధిలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఒంటరిగా ఉంటూ పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని పెయింటింగ్ పనులు చేయడానికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు బిల్డింగ్ పైనుంచి జారి కిందపడి తీవ్రగాయాలకు గురికాక వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

కొనసాగుతున్న అంగన్‌వాడీల ధర్నా



పిడుగురాళ్లలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

పిడుగురాళ్ల, జనవరి 12 : సమస్యల పరిష్కారం కోరుతూ చేస్తున్న అంగన్‌వాడీల సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బి బంగ్లా వద్ద పిడుగురాళ్ల, మాచవరం మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మెలో పాల్గొన్నారు. ప్రభుత్వం మొండి వైఖరి విడనాడి తమ సమస్యలను పరిష్కరించకుంటే ఎన్నాళ్లైనా సమ్మె కొనసాగిస్తామని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి కోటి సంతకాల సేకరణ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను, శాంతమణి, హజ్రా, సుజాత, శివరంజని, వెంకటరమణ, కృష్ణాంజలి, కవిత, జయశ్రీ, అరుణ, స్వప్న, శివపార్వతి, సఫియా, ఆషా, జయకుమారి, లలిత, రమణ పాల్గొన్నారు.

● అమరావతి, జనవరి 12 : న్యాయపరమైన తమ డిమాండ్‌లను పరిష్కరించాలని గత 32 రోజులుగా తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేస్తున్న అంగనవాడీ కార్యకర్తలు శుక్రవారం కూడా తమ దీక్షను కొనసాగించారు. శుక్రవారం ప్రభుత్వ పెద్దలతో తమ నాయకులు జరిపే చర్చలు సఫలం కావాలని కోరుకుంటున్నట్లు అంగనవాడీ కార్యకర్తలు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి : ఎంపీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అల్లు సత్యవతి

పిడుగురాళ్ల, జనవరి 12 : రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రతి గ్రామంలో నీటిఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు మరమ్మతులకు గురైన చేతిపంపులను బాగు చేయించాలని ఎంపీపీ అల్లు సత్యవతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి అలెక్స్ మాట్లాడుతూ గ్రామాలలో పారిశుధ్య పనులు మెరుగుపరచాలని, కాల్వల్లో పూడికతీత చేపట్టకపోవడం వల్ల తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉందన్నారు. మండల అధికార ప్రతినిధి ముడేల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యే దిశగా పనిచేయాలన్నారు. ఈ నెల 17 నుంచి వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా అధి కార బృందం ప్రతి గ్రామంలోను పర్యటించనున్నారని కరాలపాడు వైద్యాధికారి కెవి నాగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశయ్య, ఉప ఎంపీపీ సాతులూరి బాబు, ఎంఈవో ఒంగోలు రాజు, పీఆర్ ఏఈ సత్యనారాయణచారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలను పాటించాలి

దాచేపల్లి, జనవరి 12 : రహదారి భద్రతా నియమాలను పాటించాలని.. క్షేమంగా ఇంటికి చేరుకోవాలని శుక్రవారం ఆంధ్రా సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన భద్రతా వారోత్సవాలలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.శేషకుమార్ తెలిపారు. శుక్రవారం 35వ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా ఆంధ్రా సిమెంట్స్‌లో ఉద్యోగులకు, కార్మికులకు రహదారి భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించారు. ఎంవీఐ ఆర్‌టీఏ చెక్‌పోస్టు ఇన్‌స్పెక్టర్ బయ్యారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం మితిమీరిన వేగం, నిబంధనలను పాటించకపోవడమేనని తెలిపారు. మద్యం సేవించి వాహనాన్ని నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమాలలో ఎంవిఐ సురేష్, ఆంధ్రా సిమెంట్స్ ఫ్యాక్టరీ ఎజిఎం శంకర్‌నారాయణరెడ్డి, సీనియర్ మేనేజర్ రామకృష్ణ, సేఫ్టీ మేనేజర్ సంజయ్‌కుమార్ సింగ్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

సత్తెనపల్లి, జనవరి 12 : స్వామి వివేకానంద జయంతిని శుక్రవారం స్వామి వివేకానంద సేవా సంస్థ నిర్వాహకులు నోముల వెంకట చలపతి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తాలూకా సెంటర్‌లో ఉన్న వివేకానంద విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేసి అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు, దివ్వెల శ్రీనివారావు తదితరులు పాల్గొన్నారు. కాగా జై భీమ్ భారత్ పార్టీ ఆధ్వర్యంలో కూడా స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా స్వామి వివేకానంద చైతన్య భారతీ ఆధ్వర్యంలో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.రమణారెడ్డి, పుట్టి సాంబశివరావు, కే.శ్రీనివాసరావు, ఎం.రాంబాబు, జీ.కోటేశ్వరరావు, కే.రత్తయ్య, ఏ.కృష్ణ, ప్రభుదాసు, సునీల్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, జనవరి 12 : పట్టణంలోని ఓబీసీ కార్యాలయంలో ఓబీసీ మహిళా మండలి అధ్యక్షురాలు గంజర్ల లక్ష్మి ఆధ్వర్యాన శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు నజీర్‌బాషా, బత్తుల విజయ, డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి జక్రయ్య, కటకం రమణ, హరిత, గోగులరాజు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీఐ శరత్‌బాబు

● మాచర్లలో శుక్రవారం శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యాన స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పట్టణ సీఐ శరత్‌బాబు మాట్లాడుతూ యువత స్వామి వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అలాగే మండలంలోని కంభంపాడు, గన్నవరం గ్రామాల్లో కూడా వివేకానంద జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో మెట్టు గోవిందరెడ్డి, పోలిశెట్టి పుల్లారావు, గండ్లకోట శివసుందర ప్రసాద్, దగ్గుల కోటిరెడ్డి, గాజుల నరసింహారావు, చుండూరు కొండలు, కపలవాయి నరసింహారావు, కంచర్ల జగన్, అన్నపురెడ్డి అంజిరెడ్డి పాల్గొన్నారు.

● క్రోసూరు, జనవరి 12 : స్వామి వివేకానంద భావజాలం, ఆయన ఆశయాలు నేటి తరం యువతీ, యువకులకు మార్గదర్శకం అని ఆర్‌ఎస్‌ఎస్ రాష్ట్ర సభ్యులు కృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం బయ్యవరంలో జరిగిన స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. యంగ్ యూత్ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన చందు శేషగిరిని ఈ సందర్భంగా సత్కరించారు. గ్రామంలో మొట్ట మొదటి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు ఉద్యోగం సాధించిన సూదా సాంబశివరావును సత్కరించటంతో పాటు విద్యా ఉపాధి అవకాశాలను మెరుగు పరచటంలో గ్రామస్తులను చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో వివేకానంద స్వామి విగ్రహం దాత వినోదుల రామారావు, గ్రామానికి చెందిన సుకుమార్, రమేష్, నరసింహారావు, శివబాల కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వర్లు, అశోక్, పుల్లారావు, నబీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, జనవరి 12: కొండమోడులోని కెఎస్ఆర్ మరియు పిఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వివేకానంద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ కోనేటి నరసింహారావు, విద్యార్థులు స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రబీ సీజన్‌కు ఎరువులు సిద్ధం : ఏవో

మాచవరం జనవరి 12: రబీ సీజన్‌లో రైతులకు కావలసిన వివిధ రకాల ఎరువులు ఆయా గ్రామాల రైతుభరోసా కేంద్రాలలో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారిణి రామమ్మ రైతులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సిహెచ్ సింగరయ్య అధ్యక్షతన మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వెటర్నరీ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పశుసంవర్ధకశాఖ ద్వారా రైతులకు అందజేస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లక్ష్మీరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ వంకాయల రమేష్, ఎంపీటీసీ చిట్టిప్రోలు గురవయ్య, ఎంపీడీవో వరప్రసాద్, వ్యవసాయశాఖ సిబ్బంది నరసయ్య, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి జంగా పరామర్శ

పిడుగురాళ్ల, జనవరి 12 : పందిటివారిపాలెం మాజీ సర్పంచ్ పందిటి పుల్లారెడ్డి కుటుంబాన్ని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి శుక్రవారం పరామర్శించారు. పుల్లారెడ్డి మృతి చెందిన వార్త తెలుసుకున్న జంగా కృష్ణమూర్తి వెంటనే పుల్లారెడ్డి కుటుంబాన్ని పరామర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామస్తులతో పాటు భూషణం చెన్నయ్య, షఫీ, మాశెట్టి పుల్లారావు, పలువురు నాయకులు వున్నారు.

రాక్షస పాలనను గద్దె దింపండి

● బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీలో యరపతినేని



బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీలో పాల్గొన్న యరపతినేని

గురజాలటౌన్, జనవరి 12 : రాష్ట్రంలో రాక్షస పాలన రాజ్యమేలుతోందని, ప్రజలందరూ ఏకమై ఈ రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దింపాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీలో భాగంగా శుక్రవారం పట్టణంలోని 15వ వార్డులో యరపతినేని టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. మహిళ, రైతు, యువత, వెనుకబడిన వర్గాల సాధికారిత భలోపేతంతోపాటు ఇతర సంక్షేమ పథకాలతో పేదలను ధనికులుగా తీర్చిదిద్దేందుకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు మేనిఫెస్టోను రూపొందించారు. వైసీపీ నేతలు అహకారంతో టీడీపీ, జనసేన నేతలపై దాడులకు పాల్పడుతున్నారని, ఇప్పటికైనా మానుకోకుంటే భవిష్యత్తులో తీవ్ర మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా సైకో ముఖ్యమంత్రిని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి శరమాల హనుమంతురావు, జనసేన జిల్లా కార్యదర్శి బడిదెల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పిడి నరసింహారావు, టీడీపీ కౌన్సిలర్ నేలవల్లి వరలక్ష్మి బొల్లయ్య, కొట్టే శ్రీనివాసరావు, జనసేన కౌన్సిలర్ చింతకాయల కల్యాణ్ పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మొదటిసారిగా జనసేన నేతలతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి శరమాల హనుమంతురావు, జనసేన జిల్లా కార్యదర్శి బడిదెల శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు ఉప్పిడి నరసింహారావు, చింతకాయల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పుల్లారెడ్డి కుటుంబానికి అండగా ఉంటా

పిడుగురాళ్ల, జనవరి 12 : పందిటివారిపాలెం మాజీ సర్పంచ్ పందిటి పుల్లారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పందిటివారిపాలెంలో పుల్లారెడ్డి భౌతికకాయానికి ఆయన శుక్రవారం నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని, పార్టీతో పాటు తాను వ్యక్తిగతంగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామస్తులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో గండికోట వెంకటేశ్వర్లు, తురకా వీరాస్వామి, బండ్ల శేఖరయ్య, నంద్యాల వెంకటేశ్వరరెడ్డి, చింతలపూడి రామ్మూర్తి, గుర్రం వీరారెడ్డి, నరమాల బాల మంగయ్య, గుర్రం చినపుల్లారెడ్డి, దియ్యా సైదయ్య, ముత్యం రామిరెడ్డి, పందిటి రామకృష్ణారెడ్డి, వీరారెడ్డి, ముత్యం పెదవెంకటేశ్వరరెడ్డి, గుంజా నాగేశ్వరరావు, యడ్లపల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

నల్లచట్టాన్ని రద్దు చేయాల్సిందే : కందిమళ్ల

రెంటచింతల, జనవరి 12 : దుర్మార్గమైన నల్ల చట్టాన్ని ప్రజలపై రుద్దాలని ప్రభుత్వం చేస్తున్న ప్రక్రియను వెంటనే రద్దుచేయాలని టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి కందిమళ్ల సూర్యరాజ్ డిమాండ్ చేశారు. రెంటచింతలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నల్లచట్టం ప్రకారం అధికారులకు ప్రజల భూములు ఆస్తులకు సంబంధించిన అంశాలు నమోదు చేసే హక్కు కల్పించినట్లు చెప్పారు. ఈ చట్టం వల్ల చిన్న, సన్నకారు రైతులు, దళితులు, బీసీ వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీడీపీ రైతు విభాగం కార్యదర్శి చేరెడ్డి కృష్ణారెడ్డి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడి రవి,బాల ఏసు,జ్ఞానయ్య తదితరులున్నారు.

రూ.15 లక్షలతో వడ్డెర సంక్షేమ భవన్ నిర్మాణం పూర్తి : డీఈ

రెంటచింతల, జనవరి 12 : ప్రముఖ శైవ క్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో వడ్డెర సంక్షేమ భవన నిర్మాణం పూర్తైనట్లు పంచాయతీరాజ్ డీఈ పాశం శ్రీనివాసరెడ్డి చెప్పారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దీని నిర్మాణానికి జిల్లా మైనింగ్ ఫండ్ ద్వారా ఎమ్మెల్యే పీఆర్కే రూ.15 లక్షలు మంజూరు చేయించారన్నారు. ఇతర నిర్మాణ పనులకు మరో రూ.15 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. ఇంకా రెంటచింతల అంకమ్మనగర్లో ఎన్ఆర్ఈజి నిధులు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు కూడా పూర్తయ్యాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వైసీపీ మండల మాజీ కన్వీనర్ పూజల రామయ్యవడ్డెర సంఘ ప్రతినిధులు ఓర్సు కాశయ్యలింగయ్యసిహెచ్‌రావు ఉన్నారు.

మాచర్ల మున్సిపాలిటీకి స్వచ్ఛ సర్వేక్షన్‌లో 8వ ర్యాంకు

మాచర్ల రూరల్, జనవరి 12 : స్వచ్ఛ సర్వేక్షన్-2023 ర్యాంకింగ్‌లో మాచర్ల మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు దక్కింది. అలాగే జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. రాష్ట్రస్థాయిలో 93 మున్సిపాలిటీలు పోటీ పడినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు. గతంలో జాతీయస్థాయి స్కొచ్ అవార్డును కూడా మాచర్ల మున్సిపాలిటీ దక్కించుకోవడం విశేషం.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

మాచర్ల, జనవరి 12 : సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కోడి పందాలు, పేకాట, గుండాట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మాచర్ల రూరల్ ఎస్ఐ రాజశేఖర్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తామన్నారు. కోడిపందాలు, జూదం ప్రోత్సహిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ పండుగ జరుపుకోవాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే సమాచారం అందించాలని కోరారు.

పర్యాటకులకు ప్రత్యేక ప్యాకేజీ

విజయపురిసౌత్, జనవరి 12: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఏపీ టూరిజం ఆధ్వర్యాన పర్యాటకుల కోసం ప్రత్యేక ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు లాంచీ స్టేషన్ మేనేజర్ శివారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ వరకు కొండకు వెళ్లే విద్యార్థుల కోసం లాంచీ టిక్కెట్‌పై 15 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు చెప్పారు. పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ కొండకు ప్రత్యేక లాంచీ సర్వీసులు నడపనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, పర్యాటకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదు : బీజేపీ

మాచర్ల రూరల్, జనవరి 12: వైసీపీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వరికపూడిశెల శంకుస్థాపన పేరుతో ప్రజల ఓట్లను దండుకునేందుకు వైసీపీ ప్లాన్ చేసిందన్నారు. కాగా వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన బత్తుల రాంబాబు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుమ్మడి కోటేశ్వరరావు యాదవ్, మాచర్ల అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి నాసరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కూనిశెట్టి వెంకటేశ్వర్లు, శెట్టి హనుమంతురావు, పోలిశెట్టి శ్రీనివాసరావు, మేళం మధుబాబు, బొగ్గవరపు మస్తాన్‌రావు, జక్కా సీతారామయ్య, ఓర్సు క్రాంతికుమార్, పుల్లారెడ్డి, వెలిదండి శ్రీనివాసరావు, బ్రహ్మయ్య, కాశీపతి, లక్ష్మయ్య, వరప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు.

షాలోం తీర్మాన పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే పీఆర్కే

మాచర్ల, జనవరి 12 : పట్టణంలోని 8వ వార్డులోని రేప్‌లైన్ కాలనీలో గల షాలో మందిరంలో శుక్రవారం షాలోం తీర్మాన పండుగలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.



ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్యే పీఆర్కే

ముగ్గుల పోటీలు

మాచర్ల రూరల్, జనవరి 12: పట్టణంలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ మాచర్ల, కేసీపీ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యాన ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమలో క్లబ్ సభ్యులు, కేసీపీ ఉద్యోగులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి సంతాపం

అచ్చంపేట, జనవరి 12 : అచ్చంపేటలోని వీరభద్ర కాలనీలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త మల్లెల బాబు అనారోగ్యంతో మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ మృతుని కుటుంబాన్ని ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబ సభ్యులకు నాయకుల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించారు. నాయకులు మల్లెలబాబు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మండల బీసీ నాయకులు శివరాత్రి పెద శ్రీను, టౌన్ పార్టీ అధ్యక్షుడు మాబువలి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చల్లా అనూపకళ, తాళ్ళూరి రాంబాబు, రాయిడి ప్రసాదు, తెల్లపాటి లక్ష్మీనారాయణ, ఒంటిపులి వెంకటరావు, కొమిరి వెంకటరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో కాపునాడు నాయకుల పర్యటన

అమరావతి, జనవరి 12 : కాపునాడు జిల్లా అధ్యక్షుడు పోలిశెట్టి వెంకటసత్యనారాయణ పలువురు కాపు నేతలతో కలసి పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలలో పర్యటించారు. రానున్న రోజులలో కాపునాడు ద్వారా చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాలు, రాజకీయ అంశాలపై నియోజకవర్గంలోని పలువురు కాపు నేతలతో మాట్లాడారు. సత్యనారాయణ వెంట మానూరి రమేష్, అమ్మిశెట్టి నారాయణ, ఏపూరి అనిల్, పోలిశెట్టి సాయిబాబు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్రాంతి మహిళల పండుగ : మంత్రి రోజా

సత్తెనపల్లి, జనవరి 12 : సంక్రాంతి మహిళల పండుగ అని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రోజా అన్నారు. వైఎస్ఆర్ సంక్రాంతి ముగ్గుల పోటీల్లో భాగంగా పట్టణంలోని సుగాలీ కాలనీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం జరిగింది. విజేతలకు మంత్రులు రోజా, అంబటి రాంబాబు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. మంత్రి రోజా, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు కోడి పందాలు వేశారు. సంక్రాంతి సంబరాల్లో నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కోడి పందాలు వేస్తున్న మంత్రి రోజా, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలు ముగ్గులు

● క్రోసూరు, జనవరి 12 : సంక్రాంతి ముగ్గులు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని క్రోసూరు ఎస్ఐ నరసింహం అన్నారు. క్రోసూరులోని వేణుగోపాల స్వామి దేవాలయంలో అదిత్రి ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీలను ఆయన ప్రారంభించారు. విజేతలకు పోటీల నిర్వాహకులు కాండ్రు మైసూర్ బాబు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాండ్రు కాశయ్య, గుత్తం శంకరరెడ్డి, జై భారత్ విద్యా సంస్థల అధినేత టీ జయసేంద్రారెడ్డి, బండారు మైసూర్‌బాబు తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కర్నాటి కృష్ణారావు, దుద్దుల యోహాన్, కట్టమూరి అప్పారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, జనవరి 12 : పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో నాగిరెడ్డిపాలెం విజ్‌డమ్ పాఠశాల ఆవరణలో శుక్రవారం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు సతీమణి వసంత కుమారి పోటీలను ప్రారంభించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు చక్రవర్తి, మండల అధ్యక్షురాలు చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు మహమ్మద్ పాషా, మరియదాసు, అన్నపరెడ్డి నర్సిరెడ్డి, మర్రి ప్రసాదరెడ్డి, ప్రతాపరెడ్డి, బద్ధూరి శేషిరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జనవరి 12 : అచ్చంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ చక్రవర్తి, పార్టీ మండల అధ్యక్షుడు చిలుకా చంద్రయ్య, జడ్పీటీసీ తుమ్మా విజయ ప్రతాపరెడ్డి, ఎంపీపీ భూక్యా రజినీ బాయి, ఎక్కిరాల మురళీ, గ్రామ సర్పంచ్ కంభాల వీరబాబు, ఉప సర్పంచ్ ఎస్‌కే జానీ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తి మృతి

నకరికల్లు, జనవరి 12 : ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలైన ప్రమాద సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రూపెనగుంట్ల గ్రామానికి చెందిన కంచేటి బ్రహ్మానందం శాంతినగర్ సమీపంలో గల మహానంది వీవీసీ పైపుల కంపెనీలో వాహన డ్రైవర్‌గా ఉద్యోగం చేస్తుంటాడు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో విధులు ముగించుకొని బైక్‌పై రూపనగుంట్లలోని ఇంటికి బ్రహ్మానందం బయలు దేరాడు. పిడుగురాళ్ళ-ఓడరేవు రహదారిలో 42వ మైలురాయి వద్ద పిడుగురాళ్ళ వైపు నుంచి నరసరావుపేట వైపునకు వచ్చే బైక్ వేగంగా వస్తూ నిర్లక్ష్యంగా నడపటం వలన బ్రహ్మానందం బైక్ కింద పడటంతో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు, బంధువులు నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించారు. బ్రహ్మానందంను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుని అన్న కోటేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ బీ.ప్రసాదరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల సంక్షేమానికి కృషి చేసిన ఎన్టీఆర్

● నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి జనవరి 12 : పేదల సంక్షేమానికి ఎన్టీఆర్ ఎంతో కృషి చేశారని, సమాజమే దేవాలయం పేదప్రజలే దేవుళ్లు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ స్థాపించి 90 రోజులలో అధికారం చేపట్టి దేశంలో చరిత్ర సృష్టించిన వ్యక్తి ఎన్టీ రామా రావు అని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గుజ్జర్లపూడిలో నందమూరి యువత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఆయన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో కన్నా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. ముందుగా ఎన్టీఆర్, కోడెల విగ్రహాలకు కన్నా పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విగ్రహావిష్కరణకు వచ్చిన కన్నా లక్ష్మీనారాయణకు నందమూరి యువత, టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు, సర్పంచ్ పుట్టా శివపార్వతి చలమయ్య, డాక్టర్ జగన్నాధం, అంబిక, జి.అమరేశ్వరరావు, నేతలు యెలినేడి రామస్వామి, వందనాదేవి, మక్కపాటి రామచంద్రరావు, ఆళ్ళ సాంబయ్య, మాగులూరి భానుప్రకాష్, మాగులూరి హరిబాబు, జి.అప్పారావు, కట్టా రమేష్, పలువురు మండల టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కన్నాను అభినందించిన పాస్టర్లు

సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను శుక్రవారం సత్తెనపల్లి పట్టణానికి చెందిన పలువురు పాస్టర్లు ఆయన కార్యాలయంలో కలసి అభినందించారు. ఆయన విజయం కోసం ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ నేత కుటుంబానికి పరామర్శ

సత్తెనపల్లి మాజీ కౌన్సిలర్, టీడీపీ నేత బలిజేపల్లి సురేష్ కుమార్ తల్లి నక్షత్రమ్మ అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారాన్ని తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ శుక్రవారం వైద్యశాలకు వెళ్ళి పరామర్శించారు. సురేష్ కుమార్‌తో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు.

టీడీపీ గెలుపునకు కార్యకర్తలు కృషి చేయాలి

ముప్పాళ్ళ, జనవరి 12 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చే వరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువకులు నిరంతరం కృషి చేయాలని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని నార్నెపాడు, కుంకావారిపాలెం గ్రామాల్లో కన్నా పర్యటించారు. కుంకావారిపాలెంలో గాయపడిన టీడీపీ కార్యకర్త వంశీని పరామర్శించారు. నార్నెపాడులో రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ మండల సీనియర్ నాయకులు రావిపాటి దేవేందరరావును పరామర్శించారు. అనంతరం గ్రామ మాజీ సర్పంచ్ పాతూరి కోటేశ్వరమ్మ, పెంచలయ్య నివాసంలో కార్యకర్తలతో మాట్లాడారు. ఇటీవల గ్రామంలో మృతి చెందిన జెట్టి లక్ష్మయ్య పెద్ద కర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, సర్పంచ్ పోలూరి యలమందరావు, నాయకులు అత్తోట వెంకట కృష్ణ, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరిస్తే జగన్ పాపాలు పోవు

● టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు

సత్తెనపల్లి, జనవరి 12 : 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాత్రాన జగన్ చేసిన పాపాలు పోవని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు అంకాళ్ళ ప్రభుదాసు, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, బలిజేపల్లి సురేష్ కుమార్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. వీటిని ప్రభుత్వం అరికట్టలేక పోయిందన్నారు. దళిత యువకుడిని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎంఎల్‌సీ అనంతబాబును ఇంకా వైసీపీ పార్టీలోనే కొనసాగిస్తూ తన వెంట తిప్పుకుంటున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు చెందిన 27 పథకాలను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. విగ్రహం ఏర్పాటు ద్వారా దళితుల్లో ప్రభుత్వం పై ఉన్న వ్యతిరేకత పోదన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెపుతామని వారు హెచ్చరించారు.

తప్పుడు ఫారం-7 దాఖలుపై ఫిర్యాదు

సత్తెనపల్లి, జనవరి 12 : నియోజకవర్గంలో మంత్రి అంబటి రాంబాబు కార్యాలయం వద్ద నుంచి అంబటి అనుచరుడైన గుడిమెట్ల రమేష్ అధిక సంఖ్యలో ఫారం-7లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు ఆళ్ళ అమరేశ్వరరావు ఇటీవల ఫిర్యాదు చేశారు. నియోజక వర్గంలోని అన్ని గ్రామాలకు చెందిన వందలాది మంది తెలుగుదేశం పార్టీ అభిమానులను ఓటర్ల జాబితా నుంచి తొలగించేలా దాఖలు చేశారన్నారు. వైసీపీ కార్యాలయం నుంచి మంత్రి అంబటి రాంబాబు ఆదేశానుసారం కార్యాలయ కంప్యూటర్ నుంచి ఒకే వ్యక్తి అధిక సంఖ్యలో ఫారం - 7లు దాఖలు చేయటం చట్ట రీత్యా నేరమని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవ నివేదికను సమర్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో రాజకుమారిని ఆదేశించారు.

టీడీపీతోనే ఏపీ అభివృద్ధి సాధ్యం : అలీ బాషా

నకరికల్లు, జనవరి 12 : టీడీపీని గెలిపించటం ద్వారానే ఏపీలో అభివృద్ధి సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా లీగల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ష్యూరిటీ బాండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరాలపాటి వలి, డాక్టర్ అహమ్మద్ బుడే, డాక్టర్ బండా సుభానీ, యామగిరి ముని, యలమంద, కొలుముల జానీ తదితరులు పాల్గొన్నారు.

తాళ్ళచెరువులో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం

అచ్చంపేట, జనవరి 12 : మండలంలోని తాళ్ళచెరువు గ్రామంలో తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి అధ్యక్షతన గ్రామ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం తేవాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ఫోన్ ద్వారా నాయకులతో మాట్లాడారు. ఓటర్ల లిస్టుపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటరావు, జంగం శౌరిరెడ్డి, వినిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, రేపూడి తోమాస్, రేపూడి జోజి, సందెపోగు కిరణ్, కుంభా ఆంజనేయులు, బాసాని విజయ భాస్కర్‌రెడ్డి, టి.వెంకటేశ్వర్లు, రామరాజు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేసిన డాక్టర్ రవి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవి

పెదకూరపాడు, జనవరి 12 : మండలంలోని 75 తాళ్ళూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని రూమ్‌లను పరిశీలించి ఆరోగ్య కార్యక్రమాల వివరాలను జగనన్న సురక్ష, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు, ఆస్పత్రిలో జరిగే ప్రసవాలను గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వివిధ రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

గోదాదేవి అమ్మవారికి సారె సమర్పణ

పెదకూరపాడు, జనవరి 12 : పెదకూరపాడులో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి త్రిశక్తి పీఠం నుంచి భక్తులు గోదాదేవికి శుక్రవారం సారె సమర్పించారు. రాజా వేణుగోపాల స్వామి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గోదాదేవి అమ్మవారికి, దేవతా మూర్తులకు భక్తిశ్రద్ధలతో నూతన వస్త్రాలు, గాజులు, పసుపు, కుంకుమ, నైవేద్యాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక శాతం మంది మహిళా భక్తులు పాల్గొన్నారు.

వేసవిలో ప్రేక్షకుల ముందుకు



పురాణ, ఇతిహాసాలను ఆధారం చేసుకొని, దానికి సైన్స్ ఫిక్షన్‌ని జత చేసి, భవిష్యత్తును అద్భుతంగా ఊహిస్తూ... దర్శకుడు నాగ్‌అశ్విన్ తెరకెక్కిస్తున్న పాన్‌ఇండియా ఫాంటసీ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ప్రభాస్ టైటిల్‌రోల్ పోషిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలు. ప్రతిష్ఠాత్మక వైజయంతీ మూవీస్ పతాకంపై అత్యంత భారీ బడ్జెట్‌తో రూపొందుతోంది. ఈ సినిమాను మే 9న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్టు నిర్మాత సి.అశ్వనీదత్ ప్రకటించారు. కాశీ, ముంబై, ఢిల్లీ, చండీగఢ్, చెన్నై, మధురై, హైదరాబాద్, విశాఖపట్నం, గుంటూరు, భీమవరం, విజయవాడ, కశ్మీర్‌తో సహా దేశంలోని పలు నగరాల్లో రైడర్‌ల ద్వారా ఈ సినిమా గ్రాండ్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ విభిన్నంగా ప్రకటించారు. 'వైజయంతీ మూవీస్ 50ఏళ్ల ప్రయాణంలో మే 9వ తేదీకి ఎంతో ప్రాధాన్యం ఉంది. మా సంస్థ నుంచి వచ్చిన జగదేకవీరుడు-అతిలోకసుందరి, మహానటి, మహర్షి చిత్రాలు అదే తేదీలో విడుదలై అఖండ విజయాలను చవిచూశాయి. అమితాబ్, కమల్, ప్రభాస్, దీపిక పదుకొనే వంటి ప్రతిభావంతులైన ఆర్టిస్టులు కలిసి నటిస్తున్న ఈ చిత్రం వైజయంతీ మూవీస్ చరిత్రలోనే మైలురాయిలా నిలిచిపోతుందని నమ్మకంగా చెప్పగలం' అని నిర్మాత అశ్వినీదత్ పేర్కొన్నారు. హాలీవుడ్ టెక్నీషియన్స్ పనిచేస్తున్న ఈ చిత్రానికి మాటలు: సాయిమాధవ్ బుర్రా, సంగీతం: సంతోశ్ నారాయణ్,



రిపబ్లిక్ డేకు మిల్లర్ రాక

ధనుష్ కథానాయకుడిగా రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'కెప్టెన్ మిల్లర్'. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వంలో జి. శరవణన్, సాయి సిద్దార్థ్ నిర్మించారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ చిత్రం తెలుగు వెర్షన్ మినహా మిగిలిన భాషల్లో శుక్రవారం రిలీజ్ చేశారు. తెలుగులో మాత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా తెలుగు హక్కులు కొనుగోలు చేసిన ఏషియన్ మల్టీప్లెక్స్ ప్రైవేట్ లిమిటెడ్, సురేశ్ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేస్తున్నట్లు శుక్రవారం తెలిపాయి. ఈ చిత్రంలో ప్రియాంక మోహన్ కథానాయిక. సందీప్ కిషన్, శివ రాజ్‌కుమార్ కీలకపాత్రలు పోషించారు. జీవీ ప్రకాశ్‌కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించారు.

చెప్పినదానికంటే గొప్పగా తీశాడు

వెంకటేశ్



'సైంధవ్' రెగ్యులర్ కథ కాదు. డిఫరెంట్ జానర్. కథ డిమాండ్ మేరకే ఎమోషనల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయి. అవి కూడా నేచురల్‌గా ఉంటాయి. నా వరకూ ఈ సినిమా విషయంలో ప్రత్యేకంగా నచ్చిన అంశం ఏంటంటే.. కూతురు సెంటిమెంట్. చాలారోజుల తర్వాత ఎమోషన్స్ పలికించే అవకాశం వచ్చింది. నటుడిగా నాకిది కొత్త జానర్' అన్నారు అగ్రనటుడు వెంకటేశ్. ఆయన హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మించిన చిత్రం 'సైంధవ్'. నేడు(శుక్రవారం) విడుదల కానుంది. ఈ సందర్భంగా వెంకటేశ్ విలేకరులతో మాట్లాడారు.

చాలామంది హీరోలు కెరీర్ పరంగా యాభై, డెభ్బై ఐదు, వంద.. ఇలాంటి నంబర్లను మైలురాళ్లుగా భావిస్తుంటారు. దాంతో ఒత్తిడి సహజం. నాకైతే అలాంటి ఒత్తిడి ఏమీ లేదు. 75 అనేది నా వరకూ నంబర్ మాత్రమే. ప్రతి సినిమాకూ నిజాయితీగా నిబద్ధతతో పనిచేయాలనేది నా సిద్ధాంతం. 75వ సినిమాతో అయిపోలేదు.. ఇంకా చాలా ప్రయాణం మిగిలుంది.

- దర్శకుడు శైలేశ్‌తో పనిచేయడం గొప్ప అనుభవం. అద్భుతమైన కథతో నా దగ్గరకొచ్చాడు తను. చెప్పినదానికంటే గొప్పగా తీశాడు. లొకేషన్‌లో అసిస్టెంట్ డైరెక్టర్ మాదిరిగా అందరితో కలిసిపోయి పనిచేశాడు. ముఖ్యంగా క్లైమాక్స్‌ని ఎక్స్‌ట్రార్డినరీగా డిజైన్ చేశాడు. కథ నడిచే తీరు కూడా కొత్తగా ఉంటుంది. ఇదంతా శైలేష్ గొప్పతనమే.
- ఇది చైల్డ్ సెంటిమెంట్ మూవీ. ఇందులో నా కూతురుగా బేబీ సారా నటించింది. ఆ అమ్మాయిలో గొప్ప స్పార్క్ ఉంది. అద్భుతంగా నటించింది. మా ఇద్దరిపై తీసిన సన్నివేశాలు ప్రేక్షకులను భావోద్వేగాలకు గురిచేస్తాయి. ఓ విధంగా ఈ కథ తనదే.
- దేశం గర్వించదగ్గ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ.. అతనితో కలిసి పనిచేసినందుకు చాలా ఆనందంగా ఉంది. 'గ్యాంగ్స్ ఆఫ్ వసేపూర్' నుంచి ఆయన ప్రయాణం విలక్షణంగా సాగుతోంది. ఇందులో ఆయనది చాలా క్రేజీ రోల్. సాధారణ సందర్భాల్లో కూడా విభిన్నంగా నటించే నటుడు నవాజుద్దీన్. ఇందులో ఆయన మార్క్ నటనను చూస్తారు.
- నిర్మాత ఏ విషయంలోనూ రాజీ పడలేదు. కథ డిమాండ్ మేరకు 'ఇంద్రప్రస్థ' అనే ఫిక్షన్ సిటీని నిర్మించారాయన. డ్రగ్స్, గన్స్ ఇలాంటి హాలీవుడ్ తరహా కల్చర్ తెరపై కనిపిస్తుంది. ఇదంతా దర్శకుడి సృజన. 'సైంధవ్' సినేరియా చాలా కొత్తగా ఉంటుంది. ఈ సినిమా తర్వాత ఇలాంటి కథలు ఇంకొన్ని వస్తాయి. ఇక నా విషయానికొస్తే కథలు వింటున్నాను. చేయబోతున్న సినిమాల గురించి త్వరలో చెబుతా.



డేట్ కుదిరింది



రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తిరగబడరా సామి'. మాల్వీ మల్హోత్రా కథానాయిక. మల్కాపురం శివకుమార్ నిర్మాత. శుక్రవారం ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి 23న 'తిరగబడరా సామి' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. 'యువతను ఆకట్టుకునే రొమాన్స్, కుటుంబ ప్రేక్షకులను ఆకర్షించే సెంటిమెంట్, మాస్‌ను అలరించే హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. మనారా చోప్రా ప్రత్యేకగీతంలో నర్తించారు' అని యూనిట్ తెలిపింది. మకరంద్‌దేశ్‌పాండే, జాన్ విజయ్, రఘుబాబు, అంకిత ఠాకూర్, రాజా రవీంద్ర కీలకపాత్రలు పోషించారు. సంగీతం:జేబీ. సినిమాటోగ్రఫీ: జవహర్ రెడ్డి ఎం.ఎన్

తంత్ర గీతం వచ్చింది




అనన్య నాగళ్ల, ధనుష్ రఘుముద్రి, సలోని ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'తంత్ర'. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి., రవిచైతన్య నిర్మించారు. ఈ చిత్రం నుంచి అనురాగ్ కులకర్ణి ఆలపించిన 'ధీరే ధీరే' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్, నటి అనసూయ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'అనురాగ్ కులకర్ణి అద్భుతంగా ఆలపించిన గీతమిది. త్వరలో ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం' అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఫస్ట్ లుక్, టీజర్‌కు వస్తున్న ఆదరణ మాకు చాలా ఉత్సాహాన్నిచ్చింది. వినూత్నమైన అంశాలతో ప్రేక్షకులకు వినోదం పంచే చిత్రమిది' అన్నారు.



సోదర ద్వయం దర్శకత్వంలో

వరుస వైఫల్యాలను అధిగమించి 'విక్రమ్' చిత్రంతో తిరిగి హిట్ బాట పట్టారు కమల్‌హాసన్. ఆ సక్సెస్ ఇచ్చిన ఉత్సాహంతో వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రస్తుతం ఆయన మణిరత్నం దర్శకత్వంలో 'థగ్ లైఫ్' చిత్రం చేస్తున్నారు. షూటింగ్ జరుగుతోంది. దీంతో పాటు ఆయన కథానాయకుడిగా ఓ పాన్ ఇండియా చిత్రం రూపొందుతోంది. 'కేహెచ్ 237' అనేది వర్కింగ్ టైటిల్. ఆర్ మహేంద్రన్‌తో కలసి కమల్‌హాసన్ తన సొంత బేనర్ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి మేకర్స్ స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు. యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు అన్బు, అరివు సోదర ద్వయం 'కేహెచ్ 237'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ విషయాన్ని కమల్‌హాసన్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అన్బు అరివ్‌తో దిగిన ఫొటోను కమల్‌హాసన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడిస్తామని చిత్రబృందం తెలిపింది.





పల్నాడు వార్తలు

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



పేదలకు తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 12: పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయం ఆవరణలో శుక్రవారం చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ చేశారు. నేషనల్ యూత్ దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా టీడీపీ డాక్టర్ సెల్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, యువనాయకుడు డాక్టర్ కడియాల లలిత్‌సాగర్‌లు 8మందికి తోపుడు బండ్లు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంగళగిరిలో పేదల కోసం చేస్తున్న కార్యక్రమాల స్ఫూర్తితో చిరువ్యాపారులకు అండగా నిలుస్తున్నామన్నారు. యువ నాయకుడు డాక్టర్ కడియాల లలిత్ మాట్లాడుతూ వైసీపీ హయాంలో పేదలు అల్లాడి పోతున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ అఖండ విజయం సాధించాలని కోరుకుంటున్నామని, మరోసారి చంద్రబాబునాయుడుని సీఎంగా చూడాలని రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో కోటా కిరణ్‌కుమార్, గొట్టిపాటి జనార్ధన్‌బాబు, తాతయ్య కూరపాటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పల్నాడు కమిటీలో నియామకాలు

నరసరావుపేట టౌన్, జనవరి 12: పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఆదేశాల మేరకు సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన వారిని టీడీపీ జిల్లా ప్రధాన కమిటీలో అనుబంధ కమిటీలలో శుక్రవారం నియమించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడుగా బి.ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధిగా డి.శ్రీనివాసరావు, పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శిగా ఎం.కిషోర్‌లను నియమించారు.

పోలీసు సిబ్బందికి అండగా ఉంటాం

● ఎస్పీ రవి శంకర్‌రెడ్డి


హోంగార్డుకు చెక్కును అందజేస్తున్న ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి

నరసరావుపేట లీగల్, జనవరి 12: నిరంతరం ప్రజా రక్షణకు పాటుపడే పోలీసు సిబ్బందికి అండగా ఉంటామని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. అనారోగ్య కారణాల వల్ల మరణించిన హోంగార్డు కుటుంబానికి ఆర్థిక చేయూతతో పాటు అతని కుమారుడికి హోంగార్డుగా ఉద్యోగం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఆయన కార్యాలయంలో ఉద్యోగ నియామక పత్రంతో పాటు హోంగార్డులు ఒకరోజు వేతనాన్ని రూ.5 లక్షల చెక్కును హోంగార్డు కుటుంబ సభ్యులకు అందజేశారు. శావల్యాపురం పోలీసు స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ గత సంవత్సరం మే నెలలో అనారోగ్య కారణాల వల్ల హోంగార్డు బాబు మృతిచెందాడు. ఆయన కుటుంబానికి జిల్లాలో పనిచేస్తున్న సాటి హోంగార్డులు తమ ఒకరోజు వేతనాన్ని ఆర్థికసాయం చేయటం అభినందనీయమని ఎస్పీ అన్నారు. ఇంటికి పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబాన్ని ఆదుకోవటానికి కుటుంబంలోని మృతిచెందిన హోంగార్డు కుమారుడు సాయి రామకృష్ణకు హోంగార్డు ఉద్యోగం ఇచ్చినట్టు ఆయన తెలిపారు. హోంగార్డు సిబ్బంది సమస్యలను, కనీస అవసరాలను ఎప్పటికప్పుడు ఎస్పీ దృష్టికి తీసుకువెళ్ళి వాటి పరిష్కారానికి కృషిచేస్తున్న హోంగార్డు ఆర్ఐ రవికిరణ్‌ను ఎస్పీ అభినందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రవికిరణ్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన సీఐ అశోక్ కుమార్

పల్నాడు జిల్లా ఎస్పీ వై రవిశంకర్‌రెడ్డి డీసీఆర్‌బీ సీఐ ఏ అశోక్‌కుమార్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటివరకు నరసరావుపేట మొదటి పట్టణ సీఐగా సేవలందించిన అశోక్‌కుమార్ ఇటీవల జరిగిన బదిలీల్లో డీసీఆర్‌బీకి వచ్చారు.

ఆటో ఫైనాన్స్ యజమానిని అరెస్టు చేయాలి

● కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ డిమాండ్

నరసరావుపేట టౌన్, జనవరి 12: ఒంగోలు పట్టణానికి చెందిన ఆటో ఫైనాన్స్ యజమానిపై అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కే కృష్ణ మాట్లాడుతూ ఫైనాన్షియర్ ఒత్తిడి కారణంగానే మనస్తాపం చెంది బాపట్ల జిల్లా చుండూరు మండలం మండూరుకు చెందిన వెంకటేశ్వర్లు 2023 డిసెంబరు 23న ఆత్మహత్యకు పాల్పడ్డాడని అన్నారు. ఈ మేరకు మృతుడి భార్య దత్తాద్రి చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ గొల్లపూడి చిన్నప్రసాద్, సహాయ కార్యదర్శి జక్కా బ్రహ్మయ్య, జంపాల దుర్గ, సీహెచ్ రాజశేఖర్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కంబాల ఏడుకొండలు, సీఐటీయూ సిలార్ మసూద్, ఓర్సు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రొంపిచర్ల, జనవరి 12: మండలంలోని రొంపిచర్ల, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం, మర్రిచెట్టుపాలెం గ్రామాల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ రాంబాబు శుక్రవారం తెలిపారు. పిడుగురాళ్ళలోని 33కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు. త్రీఫేజ్ కరెంటు తెల్లవారు జామున 12గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇస్తున్నట్టు తెలిపారు.

వృద్ధాశ్రమంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నరసరావుపేట లీగల్, జనవరి 12: పట్టణంలోని రామిరెడ్డిపేటలో ని వకుళ మాధవి వృద్ధాశ్రమంలో శుక్రవారం స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న న్యాయాధికారి ఆశీర్వాదం పాల్ సీనియర్ సిటిజన్ చట్టం, మనోవర్తిచట్టం, ఉచితంగా న్యాయసాయం పొందే విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, పోలీసులు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ

వినుకొండ, జనవరి 12: పట్టణంలోని పర్మినెంట్ మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దుస్తుల పంపిణీ చేపట్టారు. మున్సిపల్ కార్మికులు పట్టణంలో చేస్తున్న సేవల్లో భాగంగా పండుగను పురస్కరించుకొని మున్సిపల్ ఛైర్మన్ దస్తగిరి సతీమణి షకీలా చేతుల మీదుగా 25మంది పర్మినెంట్ ఉద్యోగులకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం

వినుకొండ, జనవరి 12: పట్టణంలోని కొండపై ఉన్న గంగాపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థాన నిర్మాణానికి పట్టణానికి చెందిన జీజీఆర్ డెవలపర్స్ గుమ్మ గోవిందరాజులు లక్షా116 రూపాయలను పట్టణ అభివృద్ధి సేవా సంఘం కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి గోవిందరాజులును అభినందించారు. అదేవిధంగా త్వరలో కూరగాయల మార్కెట్ తరఫున బద్దెపూడి బ్రహ్మయ్య, నంది నరసింహారావు, వెంకటరెడ్డి, సుబ్బారావులు ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని కమిటీ సభ్యులకు వాగ్దానం చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పులిపాటి రామారావు, జి.బాలిరెడ్డి, రామతులసిరెడ్డి, మాల్యాద్రి, డి.చెన్నయ్య, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

● జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి

కనమర్లపూడి (శావల్యాపురం) జనవరి 12: రైతులు పంటలకు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులను వాడినపుడే పెట్టుబడులు తగ్గి మంచి ఆదాయాన్ని పొందగలుగుతారని నర్సరావుపేట డీఆర్సీ డీడీఏ మద్దినేని శివకుమారి అన్నారు. మండలంలోని కనమర్లపూడిలోని పంట పొలాలను ఆమె శుక్రవారం పరిశీలించారు. అనంతరం గుంటూరు ఆత్మావారి సౌజన్యంతో ఆర్‌బీకేలో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిఏటా 2,48,000వేల కోట్లు రాయితీలు భరించి రైతులకు ఎరువులు అందిస్తుందని, దానిలో 1,08,000కోట్లు యూరియా కోసం పాశ్చాత్య దేశాలకు చెల్లించడం జరుగుతుందన్నారు. రసాయన ఎరువులు వాడడం వలన సేంద్రియ కర్బనం తగ్గిపోయి మొక్కల ఎదుగుదల తక్కువగా ఉంటుందని, వామ్, ట్రైకోడెర్మా విరిడి వంటి జీవన ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. ఎంఏవో పల్లపోతు ప్రవీణ్ మాట్లాడుతూ ఆర్‌బీకేలలో కందులను ప్రభుత్వ మద్దతుధర క్వింటా రూ.7500లకు కొనుగోలు చేయడం జరుగుతుందని, గోతాల ఖర్చు, కూలీ కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. డీఆర్సీ ఏడీఏ బీవీ శివకుమారి, రిటైర్డ్ ఏడీఏ దివి ప్రసాదరావు, వీఏఏలు బాలాజీ, స్రవంతి, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చాలి

పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు


అంగన్‌వాడీలకు సంఘీభావం తెలియజేస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 12: అంగన్‌వాడీల డిమాండ్ న్యాయమైనవని, వాటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సురేష్‌మహల్ వద్ద అంగన్‌వాడీ సమస్యలపై 32వ రోజు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షా కార్యక్రమానికి జీవీ ఆంజనేయులు శుక్రవారం మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సేవలు అమూల్యమైనవని, పార్టీలకతీతంగా అంగన్‌వాడీలకు సంఘీభావం తెలియజేయడానికి అందరూ వస్తున్నారన్నారు. చర్చల ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తల డిమాండ్లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ, యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఉపాధ్యాయ సంఘాలతో పాటు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు బీవీ నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకాయమ్మ, చంద్రమౌళి, ఉమాశంకరి, గాయత్రి, బీబులు, నాగజ్యోతి, పద్మజ, పద్మావతి, హరిత, కృష్ణకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్, జనవరి 12: ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయుసీ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ, ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణం గాంధీ పార్కు వద్ద శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అంగన్‌వాడీల అందోళనకు కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి కే కృష్ణ, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యుడు కె.ఏడుకొండలు, జె.దుర్గ, సీహెచ్ రాజశేఖర్, పీకేఎస్ శిఖినం సాంబయ్యలు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ ఆంజనేయ నాయక్, కేపీ మేటీల్డాదేవి, ఎం కవిత, నిర్మలా, మాధవి, శోభారాణి, డీ మల్లేశ్వరి, కామినేని రామారావు, గుంటూరు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 32వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద అంగన్ వాడీలు రిలే నిరాహార దీక్షలు కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్ వాడీల సంఘం అధ్యక్షురాలు జీ సావిత్రి, సీఐమండల కన్వీనర్ పేరుబోయిన వెంకటేశ్వర్లు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి అంగన్ వాడీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎం రాధాకృష్ణ, ఎం విల్సన్, ఎస్ బాబు, షేక్ అల్లాభక్షు తదితరులు దీక్షా శిబిరం వద్దకు వచ్చి అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

జేఎన్‌టీయూలో జాతీయ యువజనోత్సవం

నరసరావుపేట కల్చరల్, జనవరి, 12: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి సందర్భంగా జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివేకానందుడి బోధనలు యువతకు స్ఫూర్తినిస్తాయన్నారు. ఆయన ప్రసంగాలు యువతలో చైతన్యాన్ని నింపుతాయన్నారు. ఆయన జయంతిని పురస్కరించుకుని యేటా యువజనోత్సవం నిర్వహిస్తున్నారని చెప్పారు. అనంతరం కళాశాలలోని జాతీయ సేవా పథకం యూనిట్ విద్యార్థులు చెట్లు నాటడం, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శోభన్ బాబు, వ్యాయమ సంచాలకులు డాక్టర్ జీపీ రాజు, వివిధ విభాగాల అధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ధనుర్మాస పూజలు


స్వామివార్లకు ప్రత్యేక నైవేద్యంతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వినుకొండటౌన్, జనవరి 12: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని బోసుబొమ్మ సెంటర్‌లోని శంకర సత్రంగం నిర్వాహకులు తెలగంశెట్టి పావనిదేవి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ భగవాన్ స్వామివారికి 108గంగాళాల నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు, గోదాదేవి, రంగనాయకస్వామి, ఆండాళ్‌తల్లిలకు పూజలు నిర్వహించి పొంగళ్లుచేసి దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించా రు. గోదాదేవి, ఆండాళ్‌తల్లి, వెంకటేశ్వర స్వామి ప్రతులను ముగ్గుల రూపంలో గీయడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అన్న రమాకోటయ్య, చీతిరాళ్ల ప్రసాద్, మేడం అశోక్, దేవకి సుకన్య, చందలూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆడుదాం-ఆంధ్ర నిర్వహణ తీరుపై క్రీడాకారుల ఆగ్రహం

శావల్యాపురం, జనవరి 12: అంపైర్‌లు నిష్పక్షపాతంగా నిర్ణయాలు తీసుకోలేనప్పుడు ఆడుదాం-ఆంధ్ర క్రీడాపోటీలు నిర్వహించడం దేనికని మండలంలోని పోట్లూరు క్రీడాకారులు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడుదాం-ఆంధ్ర మండలస్థాయి క్రికెట్ పోటీలలో భాగంగా పోట్లూరు, మతుకుమల్లి జట్ల మధ్య వివాదం ఏర్పడి గురువారం మ్యాచ్ నిలిచిపోవడంతో శుక్రవారం రీమ్యాచ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నర్సరావుపేట స్టేడియం సభ్యులు మాదవరావు, మణికంఠ మ్యాచ్‌కి అంపైర్‌లుగా, మనోహర్ పర్యవేక్షకుడిగా వ్యవహరించారు. టాస్ గెలిచిన పోట్లూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో మతుకుమల్లి జట్టు బ్యాటింగ్‌కు దిగి 5ఓవర్లలో 22పరుగులు చేసింది. అంతలో బాల్ పగిలిపోవడంతో అంపైర్‌లు పాతబాల్ లేదని, ఇన్నింగ్స్ మధ్యలో బాల్ పగిలితే ఇరుజట్లుకు కొత్తబాల్‌తో ఆడిస్తామని చెప్పడంతో ఇరుజట్లు అంగీకరించాయి. మ్యాచ్ తిరిగి ప్రారంభం కాగానే తొలి బంతికే మతుకుమల్లికి చెందిన ముఖ్య బ్యాట్స్‌మన్ అవుటవ్వడంతో తర్వాతి ఆటగాళ్లు కొత్తబాల్‌తో తాము ఆడమన్నారు. దీంతో మ్యాచ్ నిలిచిపోయింది. అంపైర్లు విషయాన్ని డీఎస్‌డీవో సురేష్‌కి చేరవేయగా తాము నిర్ణయం ప్రకటించే వరకు ఆటను నిలిపివేయాలని ఆదేశించారు. అంపైర్లు ఇరుజట్ల సభ్యులను పిలిచి ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే పంచాయతీ కార్యదర్శుల ద్వారా సమాచారమందిస్తామని చెప్పడంతో పోట్లూరు క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తబాల్‌కు మొదట అంగీకరించిన మతుకుమల్లి జట్టు వికెట్ పోగానే మ్యాచ్‌కు అడ్డం తిరగడం ఎంతవరకు న్యాయమని, అంపైర్‌లు ఎందుకు నిర్ణయం తీసుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారపార్టీకి చెందిన జట్టని అంపైర్లు మతుకుమల్లి జట్టుకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మన ఊరు, మన ఆట ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ తదితరులు

నరసరావుపేట టౌన్, జనవరి 12: సంక్రాంతి సంబరాలులో భాగంగా జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం మన ఊరు, మన ఆట కార్యక్రమంలో పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట అరండల్ పేటలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జనసేన యువనాయకుడు బెల్లంకొండ అనిల్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలానీ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి శ్రీలత, రెండవ బహుమతి శ్రీలక్ష్మి, మూడవ బహుమతి కృష్ణరత్న సాధించారు. నాగజ్యోతి, రాజేశ్వరి, మల్లేశ్వరి, రేవతి, పద్మావతి ప్రత్యేక బహుమతులు పొందారు.

నడిగడ్డ జడ్పీహెచ్ పాఠశాలలో చేతిపంపు ఏర్పాటు చేయరూ..

వినుకొండ, జనవరి 12: మండలంలోని నడిగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల కోసం తాగునీటి చేతి పంపు ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10సంవత్సరాల క్రితం విద్యార్థుల అవసరాల కోసం ఏర్పాటుచేసిన బోరు నీరు సరిపోక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో వారి అవసరాల కోసం అధికారులు తప్పనిసరిగా చేతి పంపు నిర్మాణం చేపట్టి విద్యార్థులను ఆదుకోవాలన్నారు.

అడవి పేరంటాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

బొందిలిపాలెం (శావల్యాపురం) జనవరి 12: మండలంలోని శానంపూడి శివారు బొందిలిపాలెంలోని అడవి పేరంటాలమ్మ దేవాలయంలో దేవదాయశాఖాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈవో పుణ్యాల వెంకటరెడ్డి మాట్లాడుతూ గతేడాది మార్చి 23న జరిగిన ఉగాది పండుగ తరువాత నుంచి ఇప్పటివరకు రూ.92,605 హుండీ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్

ఉత్సాహంగా నల్లపాటి ప్రీమియర్ లీగ్

నరసరావుపేట రూరల్, జనవరి 12: పట్టణంలోని డీవీఆర్ గ్రౌండ్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు శుక్రవారం ఫైనల్స్ ఉత్సాహంగా జరిగాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాద్ ఆర్మీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలు ఉత్కంఠభరితంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఫైనల్ పోటీలలో పమిడిపాడుకు చెందిన జట్టు మొదటిస్థానంలో నిలిచింది. నరసరావుపేట పట్టణంలోని 26వ వార్డుకు చెందిన జట్టు రన్నర్‌గా నిలిచింది. మొదటి బహుమతి రూ.25,000/-, రన్నర్‌కు రూ.15000/- బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, నరసరావుపేట టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు, రాష్ట్ర హెచ్‌ఆర్‌డీ సభ్యులు వల్లపు నాగేశ్వరరావు, మన్నావ్ షరీఫ్, బొడపాటి పేరయ్య కనుమూరి లక్ష్మీ, రామారావు, వెంకటేశ్వర్లు, లాం కోటేశ్వరరావు, కనుమూరి రమేష్, కూరపాటి శ్రీనివాసరావు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన వైసీపీ అరాచకాలు: జనసేన నాయకులు

ఈపూరు, జనవరి 12: అధికార పార్టీ అరాచకాలు మితిమీరి పోయాయని జనసేన నాయకులు నిశ్శంకరరావు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో చెరువు నీటిని వదలడంతో దిగువన ఉన్న నూర్పిడి చేయాల్సిన వరి పంట నీటిలో తడిచి దెబ్బతిన్నది. నీటిలో తడిచిన వరి పంట పొలాలను జనసేన నాయకుడు శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ నాయకులు జనసేన సానుభూతిపరులపై అమానుషంగా ప్రవర్తించడమే కాకుండా ఆస్తులను కూడా నష్టపరుస్తున్నారని, భవిష్యత్‌లో తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు.

18న ఉపాధి హామీపై ప్రజావేదిక

వినుకొండటౌన్, జనవరి 12: ఈ నెల 18వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయం జాతీయ అభివృద్ధి పథకం కింద చేపట్టిన పనులపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎస్ఆర్‌పీ బుజ్జి శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మండలంలోని 25 గ్రామపంచాయతీల్లో ఇప్పటికే గ్రామ సభలు నిర్వహించి గ్రామస్థాయిలో ఉపాధి హామీలో జరిగిన పనులపై చర్చించడం జరిగిందన్నారు. రోజువారీ విధుల్లో భాగంగా వినుకొండ రామలింగేశ్వరస్వామి దేవాలయ గిరిప్రదక్షిణ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించి రోడ్డుకు కొలతలు చేపట్టారు.

జంగాలపల్లిలో స్పెషల్ అధికారి పర్యటన

నూజెండ్ల, జనవరి 12: మండలంలోని జంగాపల్లిలో శుక్రవారం స్పెషల్ అధికారి వినుకొండ ఏడీఏ బీ రవిబాబు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య నిర్వాహణ, అంగన్‌వాడీ కేంద్రాల నుంచి సచివాలయ సిబ్బంది ద్వారా పౌష్టికాహారం పంపిణీ, పోలింగ్ స్టేషన్‌కు వెళ్ళలేని వృద్ధుల వివరాల నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఇన్యాసమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

నరసరావుపేట రూరల్, జనవరి 12: మండలంలోని జొన్నలగడ్డలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైపీ నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైపీ నారాయణ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలన్న సంకల్పంతో సంక్రాంతి సంబరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ బహుమతులు అందజేశారు.

ఎమ్మెల్యే కానుకలకు...

బొందిలిపాలెం వైసీపీ నాయకుల తిరస్కారం

బొందిలిపాలెం (శావల్యాపురం) జనవరి 12: పార్టీలో కనీస విలువ లేనప్పుడు ఎమ్మెల్యే ఇచ్చే సంక్రాంతి కానుకలు మాకెందుకని మండలంలోని బొందిలిపాలేనికి చెందిన వైసీపీ నాయకులు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు ఇస్తున్న సంక్రాంతి కానుకలను తిరస్కరించారు. దాంతో మండలంలో అన్ని గ్రామాలలో చీరెల పంపిణీకి కూపన్‌లు అందజేసినప్పటికీ బొందిలిపాలెంలో మాత్రం ఇంతవరకు కూపన్‌లు పంపిణీ కాలేదు. బొందిలిపాలెం గ్రామం మతుకుమల్లి సచివాలయం పరిధిలోకి వచ్చినప్పటి నుంచి అక్కడ జరిగే ఏ కార్యక్రమాలకు బొందిలిపాలెం నాయకులను ఆహ్వానించడం లేదని, ఈ నెల 9వ తేదీన జరిగిన సచివాలయ ప్రారంభోత్సవానికి కూడా తమకు ఆహ్వానం లేదని, నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కూడా తమను పిలవలేదని నాయకులు కినుకవహించారు.

అనంతలక్ష్మికి సాహిత్య అకాడమీ విశిష్ఠ పురస్కారం

నరసరావుపేట కల్చరల్, జనవరి, 12. రచయిత్రి, టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి గద్దె అనంతలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి విశిష్ట పురస్కారం అందుకున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఆమె తెలిపారు. ఈ నెల 11న పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణంలో జరిగిన ఒక కార్యక్రమంలో పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అకాడమి అధ్యక్షురాలు పి.శ్రీలక్ష్మీ, మేయర్ షేక్ నూర్జహాన్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జేసీ బి.లావణ్యవేణి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో వికసిత్ భారత్

నూజెండ్ల, జనవరి 12: మండలంలోని పాత ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీ వీరభద్రాచారి, రెండవ ఎంఈవో రవిచంద్ర, ఏవో ఎస్‌కే సుగుణాబేగం, ఈవోపీఆర్‌డీ, రవి కుమార్, ఏపీవో కే నాగేశ్వరరావు, డాక్టర్ పుష్పేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు, కృష్ణా జిల్లాలకు తల మానికం కొండవీడు

● కలెక్టర్ లోతేటి శివ శంకర్


రామిరెడ్డి ఇచ్చిన వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

యడ్లపాడు, జనవరి 12: చారిత్రక ప్రాశస్త్యం కలిగిన కొండవీడు ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలకు తలమానికం కానున్నదని జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ అన్నారు. మండలంలోని కొండవీడు పర్యాటక కేంద్రంలో పలు కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి సొంత నిధులు రూ.7 లక్షలతో కొనుగోలు చేయించిన చెత్త సేకరణ వాహనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కొండవీడు చారిత్రక, నాటి సంస్కృతి సంప్రదాయ ఆహ్లాదకర వాతావరణంతో కూడిన గొప్ప ప్రదేశం అన్నారు. ఫిబ్రవరి 2వ వారంలో ఇక్కడ సాహస కృత్యాలకు సంబంధించి సాహసం చేయరా డింబకా అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం అవసరమైన చెత్త సేకరణ వాహనాన్ని అందించిన రామిరెడ్డిని ఆయన అభినందించారు. కొండవీడు అభివృద్ధికి రూ.3.6 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించటం జరిగిందన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు మాట్లాడుతూ కొండవీడులో పర్యావరణాన్ని కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గోల్కొండ గ్రూపు సంస్థల అధినేత నడికట్టు రామిరెడ్డి మాట్లాడుతూ శతాబ్దాల చరిత్ర కలిగిన కొండవీడు బౌద్ధ ఆనవాళ్ళను కూడా కలిగి ఉందన్నారు. ఈ సందర్భంగా రామిరెడ్డి వాహన పత్రాలను జిల్లా కలెక్టర్ ద్వారా అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. అనంతరం సందర్శకులకు అందుబాటులో ఏర్పాటు చేసిన బోటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, శివారెడ్డి, తహసీల్దార్ కుటుంబరావు, ఎంపీడీవో హనుమారెడ్డి, బీట్ అధికారి పురుషోత్తరాజు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులను నింపుకోవాలి: ఎంపీపీ

నాదెండ్ల, జనవరి 12: మండలంలోని అన్ని చెరువులను సాగర్ నీటితో నింపుకోవాలని ఎంపీపీ తలతోటి రాణి అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శనివారం నుంచి కాలువల ద్వారా సాగర్ జలాలు వస్తాయన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషిచేసి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, పలువురు అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

258మందిపై బైండోవర్ కేసులు

యడ్లపాడు, జనవరి 12: మండలంలోని గ్రామస్థాయి పార్టీ నాయకులపై బైండోవర్ కేసుల నమోదు కొనసాగుతున్నాయి. మండలంలో 22గ్రామాలు ఉండగా సోమ, మంగళవారాల్లో 8గ్రామాలకు చెందిన 227మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసిన పోలీసులు శుక్రవారం మరో 7గ్రామాలకు చెందిన 258 మందిపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు అల్లర్లకు పాల్పడేవారిని, క్రిమినల్ కేసులలో ముద్దాయిలుగా ఉన్నవారిని గుర్తించి వారిపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. టీడీపీ, వైసీపీ నాయకులపై నమోదైన బైండోవర్ కేసుల వివరాలు గ్రామాల వారీగా.. కారుచోలలో వైసీపీ 15, టీడీపీ 15, మైదవోలు వైసీపీ 15, టీడీపీ 15, ఉన్నవ వైసీపీ 15, టీడీపీ 15, సొలస వైసీపీ 15, టీడీపీ 15, ఉప్పరపాలెం వైసీపీ 15, టీడీపీ 15, చెంఘీజ్‌ఖాన్‌పేట వైసీపీ 15, టీడీపీ15, యడ్లపాడు వైసీపీ30, టీడీపీ 30 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. వీరితోపాటు వివిధ క్రిమినల్ కేసులలో ముద్దాయిలుగా ఉన్న మరో 18 మందిపై కూడా బైండోవర్ కేసులు నమోదుచేసి మండల మేజిస్ట్రేట్, తహసీల్దార్ కుటుంబరావు ఎదుట హాజరుపరిచారు.

మిరప, శనగ సస్యరక్షణ చర్యలపై అవగాహన

యడ్లపాడు, జనవరి 12: మిరప, శనగ పంటలలో వచ్చే తెగుళ్ళు, చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. యడ్లపాడులోని రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సుకు పల్నాడు జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ వరప్రసాదరావు, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్‌లు పాల్గొని అవగాహన కల్పించారు. మిరపలో వచ్చే కొమ్మ ఎండు, కాయ కుళ్లు తెగులు లక్షణాలు వాటి నివారణకు చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో సరిత, వ్యవసాయ సహాయకులు సుప్రియ, బాపట్ల వ్యవసాయ కళాశాలకు చెందిన శిక్షణ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జనవరి 12: పట్టణంలోని పలు ప్రాంతాల్లో, సాతులూరు సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12:30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని విద్యుత్ శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌ల మరమ్మత్తుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన చిలకలూరిపేట ముస్లింలు


కాంగ్రెస్‌లో చేరిన ముస్లిం మైనార్టీ నాయకులు

చిలకలూరిపేట, జనవరి 12: పట్టణానికి చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, మజ్లిస్ పార్టీ మాజీ అధ్యక్షుడు హాజీ షేక్ సలాం, మైనార్టీ యువ నాయకుడు షేక్ ఇమ్రాన్‌ల నాయకత్వంలో 30మంది ముస్లిం మైనార్టీలు, నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్యం ఠాగూర్, పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి సమక్షంలో వారు కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ కాంగ్రెస్ కండువాలు కప్పి మాణిక్యం ఠాగూర్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ఎం రాధాకృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం ప్రసన్న, పీసీసీ కార్యదర్శులు గోవిందుశంకర్ శ్రీనివాస్, ఉప్పుటూరి అనీల్ కుమార్, షేక్ నస్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరు సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఉన్నత వైద్యసేవలు అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే బొల్లా

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 12: గ్రామీణ ప్రాంతాలలోని పేదలందరికీ ఉన్నతమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని వేల్పూరులో సురక్ష-2 కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. పేదలకు అందిస్తున్న వైద్యపరీక్షలు, వివిధ రకాల మందులను పరిశీలించి వైద్యాధికారులతో మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేల్పూరును గతంలో కొందరు నాయకులు దత్తతు చేసుకొన్నామని చెప్పారే గానీ ఏమాత్రం అభివృద్ధి జరగలేదన్నారు. తన స్వగ్రామమైన వేల్పూరును దేశంలోనే మోడల్ విలేజ్‌గా గుర్తింపు తేవాలన్నదే తన లక్ష్యమని, అందుకోసం గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చాలా వరకు పూర్తి చేశానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని, ఇన్‌చార్జి సర్పంచ్ బి.రత్నగిరి, నాయకులు ఎస్.వెంకట్రావు, ఎం.రాఘవరావు, డాక్టర్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటల పోటీలు

లింగారావుపాలెం (యడ్లపాడు), జనవరి 12: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 44వ సాంస్కృతిక, క్రీడా సంబరాలు ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సామినేని శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత 43 ఏళ్ళుగా క్రమం తప్పకుండా పోటీలను నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా నిర్వహించే సాంస్కృతిక, క్రీడా పోటీలలో ఉత్సాహవంతులైన యువతీ యువకులు పాల్గొని తమ ప్రతిభను చాటాలని కోరారు.